ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

బుధవారం 26 మార్చి 2025



5



వివాదానికి కారణమైన స్థలం

తొలుత నిర్లక్ష్యం... ఆపై ఓవరాక్షన్

- ఫిరంగిపురం స్థల వివాదంలో అతిగా స్పందించిన సీఐ
- ఆందోళన కారులు రాళ్లు రువ్వుతూ, కర్రలతో సీఐ వెంటబడిన వైనం

6

నాటి హామీ.. నేడు అమలు

ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ఆంధ్రజ్యోతి వినూత్నంగా చేపట్టిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోంది. ఏళ్లుగా అపరిష్కృతంగా సమస్యలపై ఆంధ్రజ్యోతి వేదికగా ప్రజలు గళం వినిపించగా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాటి పరిష్కారానికి శ్రీకారం చుడుతున్నారు.

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

జనవరి 28న వినుకొండ మున్సిపల్ పరిధిలోని కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లో ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వీధివీధినా పర్యటించగా స్థానికులు తామెదుర్కొంటున్న సమస్యలను వివరించి, అర్జీలను కూడా ఇచ్చారు. ఆ సమయంలో ఆయన ఆయా సమస్యలపై స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. నాడిచ్చిన హామీ మేరకు ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు నిధులను మంజూరు చేయించి మంగళవారం వాటికి శంకుస్థాపనలు కూడా చేశారు. ఏళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ జీవీని సత్కరించారు. రూ.62.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు.. మురుగు కాల్వల నిర్మాణ పనుల ప్రారంభంపై హర్షం వ్యక్తం చేశారు.





వినుకొండలోని కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లోని సీసీ రోడ్డు, మురుగు కాల్వ పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

- అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా పనులకు శంకుస్థాపనలు
- వినుకొండ మున్సిపాల్టీలోని కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లకు మహర్దశ
- ఆంధ్రజ్యోతి వేదికగా సమస్యలపై ప్రజాగళం.. పరిష్కారానికి మార్గం సుగుమం
- రూ.62.60 లక్షలతో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలకు శంకుస్థాపన
- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులను సత్కరించిన కాలనీ వాసులు



జీవీ ఆంజనేయులను సత్కరిస్తున్న కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి హనుమంతరావు, స్థానికులు

వినుకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆంధ్రజ్యోతి గొంతుకగా మారేందుకు అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రజల వద్దకే తీసుకువెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించే క్రమంలో జనవరి 28న వినుకొండ మున్సిపాల్టీలోని 23, 31 వార్డుల్లో అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా.. కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆంధ్రజ్యోతి వేదికగా గాయత్రినగర్.. కొట్నాల్ల వీధిలో జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరు కాగా ప్రజలు సమస్యలను తెలియజేసి అర్జీలను అందజేశారు. నాడు హామీ ఇచ్చినట్లుగా ఆయా సమస్యల పరిష్కారానికి జీవీ నేడు నడుంకట్టారు. ఆయా కాలనీల్లో రూ.62.60 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఆంధ్రజ్యోతి నిర్వహించిన కార్యక్రమం ద్వారా తమ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రగతి పనులకు శంకుస్థాపన చేసిన జీవీకి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి చేసి చూపిస్తాం : జీవీ

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వినుకొండ (మిగతా 8వ పేజీలో)

రూ.17.60 లక్షలతో కొట్నాల్లవీధిలో పనులు

పేద ముస్లిం మైనార్టీ వర్గాలు నివసించే కొట్నాల్లవీధి ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోలేదు. తాగునీటి పైపు లైన్ కోసం సిమెంట్ రోడ్డు పగలగొట్టి వదిలేశారు. మురుగు కాల్వలు లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారు. ఆయా సమస్యలను ఆంధ్రజ్యోతి వేదికగా జీవీకి వారు గతంలో తెలిపారు. ఆ వీధిలో పర్యటించిన జీవీ ఆయా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన జీవీ కొట్నాల్లవీధి అభివృద్ధికి బాటలు వేశారు. రూ.17.60 లక్షలతో ఆ ప్రాంతవాసులు కోరిన ప్రగతి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజల సమక్షంలోనే వారడిగిన పనులకు శంకుస్థాపన చేశారు.


గాయత్రినగర్‌లో రూ.45 లక్షలతో వసతులు

కొత్తగా ఏర్పాటైన గాయత్రినగర్‌లో గత ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదు. అంధ్రజ్యోతి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న జీవీ వీధివీధిలో పర్యటించారు. మహిళలు ఎక్కడికక్కడ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేసి తమ ఇబ్బందులను తెలిపారు. నగర్ కాల్వకట్ట మొదటి వీధిలో సిమెంట్ రోడ్డు.. మురుగు కాల్వలు, ఎన్ఎస్పీ కాల్వపై బ్రిడ్జి నిర్మించాలన్నారు. మరో వీధిలో రోడ్డు, డ్రెయిన్, తాగునీటి పైపులైన్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆ రోజు ఇచ్చిన హామీ మేరకు జీవీ మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. రూ.45 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆయా పనులకు శంకుస్థాపనలు చేశారు. తాగునీటి సమస్యలను పరిష్కరిస్తానని తాజాగా హామీ ఇచ్చారు.

పరీక్షల వేళ.. పెరిగిన కోతలు

- విద్యుత్ సరఫరాలో అంతరాయాలు
- గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన వైనం
- పరికరాల కొరత అంటున్న సిబ్బంది

ఎండలు మండుతోన్న కొద్ది విద్యుత్ సరఫరాలో అంతరాయాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రాల్లో మినహా మండల, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కువవుతున్నాయి. పగటి పూటే అధికం గా విద్యుత్ అంతరాయాలుంటున్నాయి. ఇక రాత్రి సమయాల్లో ఎప్పుడు అంత రాయాలు వస్తాయో తెలియని పరిస్థితులు నెలకొంటున్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. అసలే పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు , మరో వైపు మండుతోన్న ఎండలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవు తుంటే మరో వైపు విద్యుత్ కోతలు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి.



గుంటూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని గుంటూరు సర్కిల్ తెనాలి డివిజన్‌లోని పలు సెక్షన్‌లోనూ విద్యుత్ అంతరాయాలు నెలకొంటున్నాయి. ఇక బాపట్ల సర్కిల్ పరిధిలోని బాపట్ల డివిజన్‌లో కర్లపాలెంలోని నందిరాజుతోట, యాజిలి, నల్లమోతు వారి పాలెం, కంకటపాలెం, పీవీపాలెం, అమృతలూరు, వేమూరు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఉంటు న్నట్లు సమాచారం. ఇక పల్నాడు జిల్లా సర్కిల్ పరిధి లోనూ రాజుపాలెం, నాదెండ్ల, దుర్గి, కారంపూడి ఆయా ప్రాంతాల సెక్షన్‌ల పరిధిలో కూడా విద్యుత్ అంతరా యాలు ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపుతున్నాయి. రాజుపాలెం మండలం ఇనుమెట్ల గ్రామంలో అయితే కొన్ని సార్లు పగలంతా విద్యుత్ సరఫరా (మిగతా 8వ పేజీలో)

లక్ష్యాలపై.. మార్గనిర్దేశం

- కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న వెంకటమురళి
- జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై నేడు పీపీటీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వెలగపూడిలోని సచివాలయం వేదికగా జరుగుతున్న కలెక్టర్ల సదస్సుకు జిల్లా కలెక్టర్ వెంకట మురళి హాజరయ్యారు. మంగళ, బుధ రెండు రోజుల పాటు తలపెట్టిన ఈ సదస్సులో ప్రభుత్వ ప్రాథమ్యాలతో పాటు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలను కూడా చేర్చారు. తొలి రోజు మంగళవారం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ సంపద సృష్టిపై దృష్టి పెట్టి ఆదాయ మార్గాలను పెంచాలని మార్గనిర్దేశం చేశారు. ఆయా విభాగాలకు సంబంధించి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా కలెక్టర్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సదస్సులో సూచించారు. శాంతిభద్రతలకు సంబంధించి జరిపిన సమీక్షలో కలెక్టర్ వెంకటమురళితో కలిసి ఎస్పీ తుషార్‌డూడీ పాల్గొన్నారు. జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులతో పాటు పలు అంశాలపై కలెక్టర్ బుధవారం నివేదించనున్నారు. జిల్లాలో సాధించిన పురోగతితో పాటు, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలు, పర్యాటక, పారిశ్రామిక రంగాలలో తీసుకోవాల్సిన చర్యలతో కూడిన వివరాలను పీపీటీ రూపంలో కలెక్టర్ వివరించనున్నట్లు సమాచారం

ఎస్పీ తుషార్ డూడీకి సీఎం అభినందనలు

ప్రభుత్వ పథకాలను ఎరగా వేసి ఆన్‌లైన్‌లో దోపిడీకి పాల్పడుతున్న అంతరాష్ట్ర సైబర్ నేరగాళ్లు ముగ్గురిని చీరాల టుటౌన్ పోలీసులు ఈ ఏడాది ఫిబ్రవరిలో అరెస్టు చేసిన వైనంపై ఎస్పీ తుషార్‌డూడీని కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కేసును ఎస్పీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఛేదించారు. చుండూరు మండలం వేటపాలేనికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడ్ని బెదిరించి రూ.74 లక్షల సైబర్ మోసం కేసులో కూడా నిందితులను రోజుల వ్యవధిలోనే అరెస్టు చేయగలిగారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఎస్పీల సమీక్షలో ఈ రెండు సైబర్ కేసుల అంశం చర్చకు రావడంతో వాటిని ఛేదించిన తీరుతెన్నులను ఎస్పీ తుషార్ డూడీ సదస్సులో వివరించారు. సైబర్ నేరాల నిగ్గు తేల్చడంలో ఈ రెండు కేసులను రాష్ట్రస్థాయిలో కేస్ స్టడీస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు.



సదస్సులో పాల్గొన్న ఎస్పీ తుషార్ డూడీ, కలెక్టర్ వెంకటమురళి

స్థానిక సంస్థల్లో ఖాళీలకు రేపు ఎన్నిక

నాలుగు ఉప సర్పంచ్, ఓ ఎంపీపీ, కో ఆప్టెడ్ స్థానానికీ..

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వివిధ కారణాలతో స్థానిక సంస్థల్లో ఏర్పడిన ఖాళీల భర్తీలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 20 ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా జిల్లాలో నాలుగు ఉప సర్పంచుల స్థానాలతో పాటు ఓ ఎంపీపీ, కో ఆప్టెడ్ సభ్యుడి ఎన్నిక గురువారం ఆయా కార్యాలయాలే వేదికగా జరగనుంది. ఎన్నికను చేతులెత్తే విధానంతో జరిపి అదే రోజు మధ్యాహ్నం ప్రమాణ స్వీకారం కూడా చేయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక వేళ కోరం లేక ఎన్నిక జరగని పక్షంలో మరుసటి రోజు జరపనున్నారు.

ఎన్నిక జరిగే స్థానాలివే...

పిట్టలవానిపాలెం మండలం ఎంపీపీ విషయంలో వైసీపీ ప్రభుత్వ హయాంలోనే రెండున్నరేళ్ల పాటు పదవులు అనుభవించేలా ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం చందోలు --1 ఎంపీటీసీగా ఉన్న షేక్ బాజీ ఎంపీపీగా తొలి రెండున్నరేళ్లు పదవిని అనుభవించి దాదాపు ఏడాది క్రితమే రాజీనామా చేశారు. దీంతో ఉప ఎంపీపీగా ఉన్న పిట్టువారిపాలెం ఎంపీటీసీ దెందుకూరి సీతారామరాజు ఏడాది నుంచి ఇన్‌చార్జి ఎంపీపీగా ఉన్నారు. నిబంధనల ప్రకారం ఎన్నిక జరపాల్సి ఉండగా ఎంపీపీ స్థానాన్ని ఖాళీల జాబితాలో చేర్చిన ఈసీ ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి ఆదేశాలిచ్చింది. దీనిలో భాగంగా గురువారం ఎంపీపీని ఎంపీటీసీలు ఎన్నుకోవడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ఒకరు గతంలోనే టీడీపీ బాట పట్టారు. సంఖ్యా పరంగా చూస్తే వైసీపీ ఎంపీపీ స్థానం చేజిక్కించుకునే అవకాశం ఉంది. ఎంపీపీ ఎన్నికలో ఎంపీటీసీల సహకారంపై వైసీపీలోనే అనుమానాలు ఉన్నాయి. భట్టిప్రోలు మండల పరిధిలో మొత్తం 14 మంది ఎంపీటీసీలు ఉండగా ఇక్కడ కో ఆప్టెడ్ సభ్యుడి ఎన్నిక జరగనుంది. రాజీనామాలు చేయడంతో జిల్లాలో నాలుగు గ్రామాల్లో ఉప సర్పంచుల స్థానాలు ఖాళీ అయ్యాయి. పెదపులివర్రు, చెరుకుపల్లి మండలంలోని తుమ్మలపాలెం, పర్చూరు మండలం తుమ్మలపాలెం, రేపల్లె మండలం పేటేరు గ్రామాల్లో ఉప సర్పంచుల స్థానాలకు గురువారం ఎన్నిక జరగనుంది.



సీఆర్డీఏ కార్యాలయంలో పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

90 శాతం టెండర్లు.. 15 రోజుల్లో పనులు

- త్వరలో అందుబాటులోకి రాజధాని భవనాలు
- డెడ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని నిర్దేశించాం
- ప్రభుత్వ భవనాల పనుల పరిశీలనలో మంత్రి నారాయణ

8

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (బుధవారం సాయంత్రం)

సహారి : 4.51 (గురువారం ఉదయం)

మిర్చి రైతుల నిరసన

ధర తగ్గించడంతో రోడ్డెక్కిన రైతులు



8

మిర్చి యార్డు ఎదుట రాస్తారోకో చేస్తున్న రైతులు

సాంకేతిక నైపుణ్యాలతో ఉద్యోగావకాశాలు

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు (విద్య)మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుంటే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించవచ్చునని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. నల్లపాడులోని ఎంటీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జరిగిన ఉద్యోగ విజయోత్సవ, వార్షికోత్సవంలో ఆలపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్



విద్యార్థికి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

కళాశాలలో చదివిన విద్యార్థులు ఎంతో నైపుణ్యంతో ఉంటారని వారికి అదనపు సాంకేతిక నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం కల్పిస్తే అనేక రంగాల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్.ఎంఏవీ రామకృష్ణ, ఎంటీటీఎస్ ప్రధానాచార్యులు తాళ్లూరి శేఖర్ తదితరులు మాట్లాడుతూ చివరి సంవత్సరం పాలిటెక్నిక్ చదువుతున్న 262 మంది విద్యార్థులకు గాను 252 మంది వివిధ కంపెనీలలో ప్రాంగణ నియామకాల ద్వారా ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. వార్షిక వేతనం రూ.1.8 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంటీటీఎస్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ కే హరీష్, వసంత ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ కొండేపాటి హనుమంతరావు, రిటైర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవీ శేషా చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ అర్హత పరీక్షా ఫలితాల విడుదల

పెదకాకాని, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో దూరవిద్య కేంద్రం ఈనెల 23న నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాల అర్హత పరీక్షా ఫలితాలను మంగళవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా పరీక్షల ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ మాట్లాడుతూ ఎంబీఏ కోర్సుకు 285 మంది దరఖాస్తు చేసుకోగా 257 మంది అర్హత సాధించారని, ఎంసీఏ కోర్సుకు 57 మంది దరఖాస్తు చేసుకోగా 54 మంది అర్హత సాధించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా దూరవిద్య కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరీక్షల ఫలితాలను దూర విద్యా కేంద్రం వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఓఎస్డీ రవికుమార్, దూరవిద్య కేంద్రం అధికారులు కృష్ణవేణి, నేలపాటి నాగేశ్వరరావు, ఎల్ఎస్ రాంబాబు, జె.శ్రీనివాసరావు, వై.రాధాకృష్ణ పాల్గొన్నారు.

తొలుత నిర్లక్ష్యం... ఆపై ఓవరాక్షన్

ఫిరంగిపురం స్థల వివాదంలో అతిగా స్పందించిన సీఐ

రివాల్వర్‌తో యువకుడుపై దాడి... కాల్చేస్తానంటూ ఆందోళనకారులకు హెచ్చరికలు

రెచ్చగొట్టేలా వ్యవహరించడం వల్లే ఉద్రిక్త పరిస్థితి

ఆందోళనకారులు రాళ్లు రువ్వుతూ, కర్రలతో సీఐ వెంటబడిన వైనం



తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేస్తున్న శాంతిపేట వాసులు

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) :: ఫిరంగిపురంలోని శాంతి పేటలో స్థల విషయంలో నెలకొన్న వివాదాన్ని అంచనా వేయడంలో స్థానిక సీఐ రవీంద్రబాబు విఫలమయ్యారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం తీర్మానించిన గ్రామకంఠం స్థలంలో ఇప్పటికే రెండు సెంట్లు కబ్జాకు గురైందని... మరో రెండు సెంట్లు స్థలాన్ని కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని కాలనీవాసులు తొలుత ఫిరంగిపురం స్టేషన్ వెళ్లి సీఐకు ఫిర్యాదు చేశారు. గేర చిన్ని కుమార్ అనే వ్యక్తి ఆ స్థలంలో పోల్స్ పాదుతున్నాడని, ఆ స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని తొలుత కాలనీవాసులు సీఐను కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే సీఐ రవీంద్రబాబు అందుకు భిన్నంగా వ్యవహరించారు. ఏదైనా ఉంటే తహసీల్దార్ కలిసి తేల్చుకోవాలని, తనకు సంబంధం లేదని చెప్పారు. రాత్రివేళ తహసీల్దార్ అందుబాటులో ఉండరని, కనీసం రేపు తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేసే వరకైనా అందులో ఎటువంటి నిర్మాణాలు జరగకుండా చూడాలని కోరినా నోమిరా అంటూ సీఐ వారిని అక్కడ నుంచి పంపించేశారు. దీంతో కాలనీవాసులంతా అక్కడికి వెళ్లి చిన్ని కుమార్ పోల్స్ పాతకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో వివాదం చోటుచేసుకుంది. విషయం పోలీసుల దృష్టికి రావడంతో తొలుత కానిస్టేబుల్, ఏఎస్ఐను అక్కడికి పంపారు. వారు ఇరు వర్గాలతో చర్చించి చిన్ని కుమార్ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా నియంత్రించ గలిగినట్లయితే వివాదం జరిగి ఉండేది కాదు. పెద్ద సంఖ్యలో కాలనీ వాసులంతా అక్కడకు చేరిన విషయం తెలుసుకున్న తర్వాత అక్కడకు వెళ్లినప్పటికీ ఇరు వర్గాలతో సంయమనంతో వ్యవహరించి సామరస్యంగా ఇరువర్గాలను అక్కడి నుంచి పంపాల్సి ఉన్నప్పటికీ సీఐ రవీంద్రబాబు అతిగా స్పందించారు. కమ్యూనిటీ స్థలం కబ్జా కాకుండా కాపాడాలంటూ నిరసన తెలియజేస్తున్న వారిలో ఒకరైన పసల అఖిల్‌ను రివాల్వర్‌తో కొట్టడంతో ఆయనకు రక్త గాయం అయింది. తాము ముందుగా స్టేషన్‌కి వెళ్లి పోల్స్ పాతకుండా స్థలం కబ్జాకు గురి కాకుండా చూడాలని కోరితే పట్టించుకోకపోగా తాము నిరసన తెలియజేస్తుంటే వచ్చి ఇరు వర్గాలను నియంత్రించకపోగా తమపై దాడి చేసి రివాల్వర్‌తో కొట్టడం ఏమిటి అంటూ స్థానికులు రెచ్చిపోయారు. సీఐ పై దాడికి యత్నించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో సీఐ పక్కనే ఉన్న కాలువలో పడిపోయారు. ఆందోళనకారులు రెచ్చిపోతుండటంతో సీఐ కూడా అగ్గికి ఆజ్యం పోసినట్లు రివాల్వర్ తీసి కాలుస్తానంటూ బెదిరించడంతో వారు మరింత రెచ్చిపోయారు. అయినప్పటికీ సీఐ రివాల్వర్ చేతిలో పట్టుకొని బెదిరిస్తుండడంతో ఆందోళనకారులు రాళ్లు విసురుతూ, కర్రలు తీసుకొని వెంట పడగా ఆయన తుపాకీ చూపిస్తూ వెనక్కు నడుస్తూ ఘటనా స్థలం నుంచి వెళ్లే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆందోళనకారులు రాళ్లు రువ్వుతూ, కేకలు వేస్తూ వెంటపడంతో అటుగా వచ్చిన ద్విచక్రవాహం ఎక్కి పారిపోయారు. దీంతో రెచ్చిపోయిన ఆందోళనకారులు పెద్ద సంఖ్యలో గుంటూరు - కర్నూలు రహదారిపై బైఠాయించి సోమవారం అర్ధరాత్రి రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. మరోవైపు ఆందోళన కారుల నిరసనతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాక జిల్లా కేంద్రం నుంచి ఎస్పీ ఆదేశాల మేరకు పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలు, తుళ్లూరు డీఎస్పీ, నిఘా విభాగం అధికారులు హుటాహుటిన అర్ధరాత్రి వేళ ఫిరంగిపురం చేరుకొని పరిస్థితి చేయి దాటకుండా శాంతియుతంగా పరిస్థితిని అదుపులోకి తీసుకు రాగలిగారు.

అసలు స్థల వివాదం ఏమిటంటే...

ఫిరంగిపురంలోని శాంతిపేటలో నాలుగు సెంట్లు ఖాళీ స్థలం ఉంది. గతంలో ఆ స్థలంలో గ్రామదేవత పోలేరమ్మ విగ్రహాలు ఉండేవి. కాలక్రమంలో ఆలయానికి ఆదరణ కొరవడడంతో శిథిలావస్థకు చేరింది. చివరకు అందులో ఉన్న విగ్రహాలను కూడా తొలగించారు. అయితే ఆ నాలుగు సెంట్లు స్థలంలో గేరా చిన్ని కుమార్ అనే వ్యక్తి రెండు సెంట్ల స్థలాన్ని ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారు. దీంతో కాలనీవాసులు మిగిలిన రెండు సెంట్ల స్థలంలో కాలనీ అంతటికీ ఉపయోగపడేలా కమ్యూనిటీ హాలు నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఆ స్థలం తనదేనని కమ్యూనిటీ హాల్ ఎలా నిర్మిస్తారంటూ చిన్ని కుమార్ కొద్దిరోజులుగా కాలనీవాసులతో గొడవ పడుతున్నాడు. అంతేగాక ఆయన పోలీస్ స్టేషన్లో కాలనీవాసులుపై ఫిర్యాదు కూడా చేశాడు. అయితే కాలనీవాసులు మాత్రం ఇది ప్రభుత్వ భూమి అని, ఇది గ్రామకంఠమని ఇప్పటికే రెండు సెంట్లు ఆక్రమించాడని మిగిలిన రెండు సెంట్లు కూడా కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడని అందులో ఎట్టి పరిస్థితిలో కమ్యూనిటీ హాల్ నిర్మించాల్సిందేనని పట్టుపట్టారు. దీంతో ఈ వ్యవహారం ఇది మరింత వివాదాస్పదంగా మారింది.

రూ.2వేల కోట్లకు పైగా సంగం టర్నోవర్

చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి, 25 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంగం డెయిరీ టర్నోవర్ రూ.2వేల కోట్ల మైలు రాయిని అధిగమించిందని సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. వడ్లమూడి సంగం డెయిరీ ప్రాంగణంలో మంగళవారం పాలకవర్గ సమావేశం జరిగింది. పలు అంశాలపై చర్చించిన పాలకవర్గం వాటిని ఆమోదించింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సంగం డెయిరీ రోజుకు 10.5లక్షల లీటర్ల పాల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. మరో 14 చిల్లింగ్ సెంటర్లను కొత్తగా ఏర్పాటు చేసి అదనంగా రోజుకు లక్షన్నర లీటర్ల పాలను సేకరించి వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.2,200కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వాల్యూయాడెడ్ ప్రొడక్ట్ బటర్, పన్నీరు వంటి ఉత్పత్తులతో పోటీ ప్రపంచంలో మరింత నాణ్యతగా అందించేందుకు రు.5కోట్ల మిషనరీ కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొత్తరకం నెయ్యి ఉత్పత్తులు మార్కెట్లోకి తీసుకురావడానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. సంగం డెయిరీలో ప్రస్తుతం 8లక్షల లీటర్ల ప్రాసెసింగ్ యూనిట్, మిర్యాలగూడలో లక్షన్నర లీటర్ల ప్రాసెసింగ్ యూనిట్‌లు సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది రైతులకు 50కోట్ల బోనస్ పంపిణీ చేయాలని పాలకవర్గం ఆమోదించిందన్నారు. నెల్లూరు, తిరుపతి వంటి ప్రాంతాల్లో సంగం ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని భవిష్యత్‌లో చెన్నైలో కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. రైతులకు సరఫరా చేసే దాణాలు కూడా కొత్తరకం దాణాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. పడ్డ దూడల ఉత్పత్తికి ప్రారంభించిన సెక్సెడ్ సెమెన్ ప్రాజెక్ట్ ద్వారా 2వేల పశువులకు సెమెన్ అందించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో 10వేల పశువులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా సెమెన్ అందించి పడ్డ దూడల పెంపుకు ప్రాజెక్ట్ పనిచేస్తుందన్నారు. అధిక దిగుబడులు ఇచ్చే బీపీటీ మినుము విత్తనాలను మార్కెట్లో సంగం బ్రాండ్ పేరుతో తీసుకురానున్నట్లు తెలిపారు. పశువుల కోసం మేలైన గడ్డి జాతి విత్తనాలు అభివృద్ధి చేసి దేశంలోనే 15మిల్క్ యూనియన్లకు అందజేస్తున్నామన్నారు. త్వరలోనే అరబ్ దేశాలతో పాటు అమెరికాకు సంగం ఉత్పత్తులు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు అన్నిరకాల సేవలదించేందుకు మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చైర్మన్ నరేంద్రకుమార్ వివరించారు. ఈ సమావేశంలో సంగం ఎండీ గోపాలకృష్ణన్, పాలకవర్గ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

ఆర్టీఈ అడ్మిషన్లకు అనుమతి

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టంలో భాగంగా రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో ఒకటో తరగతిలో అడ్మిషన్లు చేపట్టేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై న్యాయ వివాదాలు ఏర్పడిన నేపథ్యంలో ఈ మేరకు స్పష్టతనిచ్చింది. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు విద్యా సంస్థలు 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. వారికి ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తుంది.

రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కూడా: సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి, ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగ జోషి సోమవారం రాత్రి సీఎంను కలవగా పైవిధంగా స్పందించారు. త్వరలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి యూనివర్సిటీల ఏర్పాటుపై సాను కూల నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ రెండు యూనివర్సిటీల ఉద్యోగుల జీతాల సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. వర్సిటీల్లో విద్యా ప్రమాణా లు మెరుగుపరచాలని, కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని సీఎం వారికి సూచించారు.

మద్యపాన దుష్పరిణామాలపై అవగాహనకు 'కేర్'

కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యపాన వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్(కేర్) పేరుతో ఎక్సైజ్ శాఖ కొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిపై మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. బహిరంగ సదస్సులు, ఫ్లాష్ మాబ్‌లు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, సెమినార్లు, సెషన్ల రూపంలో ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ఉద్దేశం. ఈ కార్యక్రమం అమ లుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు నియమించింది. రాష్ట్ర స్థాయి కమిటీకి ఎక్సైజ్ శాఖ మంత్రి చైర్మన్‌గా ఉంటారు. ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, అదనపు కమిషనర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఎన్జీవో నుంచి ఒకరు, మరో ఇద్దరు ప్రముఖ సామాజిక కార్యకర్తలు ఇందులో ఉంటారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. ఎస్పీ, జిల్లా ఎక్సైజ్ అధికారి, విద్యా, ఆరోగ్య శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు.

కొలనుకొండ మహిళ హత్యకేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

-వివరాలు వెల్లడించిన డీఎస్పీ మురళీకృష్ణ

తాడేపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామ శివారులో మహిళను హత్య చేసి తప్పించుకుని తిరుగుతున్న ఇరువురు నిందితులను మంగళవారం తాడేపల్లి సీఐ కల్యాణరాజు అరెస్టు చేశారు. ఈ మేరకు తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి తాడేపల్లి రాధారంగనగర్‌కు చెందిన ముత్యాల కోమలకుమార్ ఎలియాస్ చింటు, విజయవాడ రాణిగారి తోటకు చెందిన హిజ్రా బత్తుల శశి ఎలియాస్ జెస్సీ లను అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి... ఈ నెల 23వ తేదీ రాత్రి సమయంలో కొలనుకొండ హైవే సమీపంలో గుంటూరు ఛానల్ వద్ద నిర్మానుష్య ప్రాంతంలో ఓ మహిళ హత్యకు గురైందన్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పలు వివరాలు సేకరించారు. మృతురాలు పామర్రుకు చెందిన సజ్జా తిరుపతమ్మగా గుర్తించారు. ఆమె భర్త పదేళ్ల క్రితం చనిపోయాడని, ఇరువురు పిల్లలతో ఏడాది క్రితం విజయవాడ రాణిగారితోటకు వచ్చి నివాసం ఉంటూ కేటరింగ్ పనులు చేసుకుంటూ అదే ప్రాంతంలో ఉండే ట్రాన్స్‌జెండర్ బత్తుల శశి ఎలియాస్ జెస్సీతో పరిచయమైంది. ఈ క్రమంలో మృతురాలికి రాధారంగ నగర్‌కు చెందిన ముత్యాల కోమలకుమార్ ఎలియాస్ చింటు పరిచయమై వీరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. కాగా రెండు నెలల నుండి రాజేష్ అనే అతనితో మృతురాలు సన్నిహితంగా వుంటుంది. ఈ క్రమంలో శశి భర్త నవీన్‌కు కూడా తిరుపతమ్మపై కోరిక ఉందన్న విషయం శశి గమనించింది. తన భర్త ఎక్కడ దూరమవుతాడోనని శశి, తనను వదిలి రాజేష్‌తో



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కల్యాణరాజు

క్లోజ్‌గా ఉంటుందని తెలిసిన కోమలకుమార్ ఇరువురు తిరుపతమ్మను ఎలాగైనా హత్య చేయాలని పథకం పన్నారు. ఈ నెల 23న తిరుపతమ్మ వడ్డేశ్వరం గ్రామంలో తెలిసిన వారిని కలవడానికి రాగా, ఇప్పటం రోడ్డులో గుంటూరు ఛానల్ వద్ద వీరిరువురు కాపు కాసి తిరుపతమ్మను అడ్డగించారు. శశి మృతురాలిని గట్టిగా పట్టుకోగా కోమలకుమార్ కత్తితో మెడపై పొడవగా బలమైన రక్తగాయాలై ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కాగా నేరం వేరే వారి పైకి వెళ్లేవిధంగా పక్కదారి పట్టించేందుకు ఒక జత చెప్పులు, షర్టు ఉన్న కవర్‌ను నేరస్థలంలో పెట్టి నిందితులు ఇరువురు పారిపోయారు. అనంతరం పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేశారు.

అజ్ఞాతంలో ప్రముఖ మొబైల్ షాప్ నిర్వాహకుడు

నరసరావుపేట లీగల్, మార్చి 25, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లో గల ఆర్డీవో కార్యాలయ సెంటర్‌లోని మొబైల్ షాప్ నిర్వాహకుడు గత మూడు రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఫోను స్విచ్ ఆఫ్ చేశాడు. బంధువులు, పరిచయస్తులు, చుట్టుపక్కల వారి నుంచి సదరు షాప్ నిర్వాహకుడు సుమారు రూ. 8 కోట్ల మేరకు అప్పులు చేసినట్లు సమాచారం. దీనిపై కొందరు సోషల్ మీడియాలో సదరు వ్యక్తి ఐపీ పెట్టినట్టు ప్రచారం చేస్తున్నారు. ఇంతవరకు సదరు వ్యక్తి ఐపీ దాఖలు చేయలేదు. ఈ విషయమై మొదటి పట్టణ సీఐ ఎంవీ చరణ్‌ను వివరణ అడుగగా తమకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదన్నారు.

అమరావతిలో పర్యటించిన జపాన్ ప్రతినిధుల బృందం

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పెట్టుబ డులు పెట్టే విషయమై బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించేందుకు ఓనో కీచి ఆధ్వర్యంలో వచ్చిన ఏడుగురు సభ్యులు గల జపాన్ ప్రతినిధుల బృందం మంగళవారం సాయంత్రం బౌద్ధ ఆరామంగా పేరు గాంచిన అమరావతిని సందర్శించారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆహ్వానం మేరకు ఈ బృందం ముందుగా ధ్యానబుద్ధ ప్రాజెక్టు, మహాచైత్యం, పురావస్తు సంగ్రహాలయాలను సందర్శించింది. అమరావతిలో బౌద్ధమతానికి 2400సంవత్సరాల చరిత్ర ఉందని ప్రపంచస్థాయిలో బౌద్ధులు ప్రతి సంవత్సరం సందర్శిస్తారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, జపాన్ ప్రతినిధులకు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రవీణ్, జేసీ సూరజ్ గనోరే, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి జపాన్ ప్రతినిధులను ధ్యానబుద్ధ జ్ఞాపికతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డానియేలు, సీఐ అచ్చయ్య, టూరిజం అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద జపాన్ ప్రతినిధులతో ఎమ్మెల్యే ప్రవీణ్, జేసీ సూరజ్ గనోరే తదితరులు

జీఎంసీకి డాక్టర్ నరేష్‌బాబు రూ.25 లక్షల విరాళం

● నూతన క్యాంటీన్ నిర్మాణం కోసం...



గుంటూరు మెడికల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశా లలో నూతనంగా చేపడుతున్న క్యాంటీన్ నిర్మాణానికి ప్రముఖ స్పైన్ సర్జన్, మల్లిక స్పైన్ సెంటర్ అధినేత డాక్టర్ జే నరేష్ బాబు రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. జీఎంసీ 1991వ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ నరేష్ బాబు వ్యక్తిగ తంగా ఈ విరాళం అందజేస్తున్నారు. ప్రస్తుతం కాలేజీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో ఉన్న పాత క్యాంటీన్‌ను తొలగించి ఆ స్థానంలో ఎగ్జామినేషన్ హాల్‌ను నిర్మిస్తున్నారు. జింకానా ఆడిటోరియం సమీపంలో కొత్త క్యాంటీన్‌ను నిర్మిస్తారు. ఫ్యాకల్టీ, వైద్య విద్యార్థులు, సిబ్బందికి వేర్వేగా కేబిన్‌లను క్యాంటీన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్యాంటీన్ నిర్మాణానికి సుమారు రూ.40 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. నరేష్‌బాబు రూ.25 లక్షలు అందజేయడంతో పాటు మిగిలిన మొత్తాన్ని నాటి తన బ్యాచ్ మేట్లను సంప్రదించి సమకూర్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. డాక్టర్ నరేష్‌బాబు మాతృమూర్తి ఆంకాలజిస్ట్ డాక్టర్ ఓలేటి శివలీల గతంలో జీఎంసీ ప్రిన్సిపాల్‌గా సేవలు అందించారు. ఆమె కూడా జీఎంసీ పూర్వ విద్యార్థే, నరేష్‌బాబు ఇరువురు సోదరులు కార్డియాలజిస్ట్ డాక్టర్ జే మహేష్ బాబు, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రంగనాథ్ కూడా గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులే. రూ.25 లక్షల విరాళం ప్రక టించిన డాక్టర్ నరేష్‌బాబును జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ మంగళవారం అభినందించారు.

ముగ్గురు వీఆర్‌వోలకు షోకాజ్ నోటీసులు

మాచవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భూముల ఆన్‌లైన్, పట్టాదారు పాసు పుస్తకాల కోసం రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు రావడంతో మండలంలోని ముగ్గురు వీఆర్‌వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మల్లవోలు, పిల్లుట్ల, తురకపాలెం గ్రామాలలో వీఆర్‌వోలుగా పనిచేస్తున్న వై ఏసుదానం, ఆర్ లోకేశ్, జానీ బాషాలకు గురజాల ఆర్డీవో మురళీకృష్ణ ఆదేశాల మేరకు తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు నోటీసులు జారీ చేశారు. ఒక వైపు మాచవరం మండలంలో భూమాయ పరిష్కారం కాక ముందే ముగ్గురు వీఆర్‌వోలకు నోటీసులు జారీ చేయటం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

బైకు అదుపుతప్పి యువకుడు మృతి



సాగర్ మృతదేహం

కారంపూడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బైకు అదుపుతప్పి లారీ కిందకు దూసుకెళ్లడంతో యువకుడు మృతిచెందిన సంఘటన కారంపూడి పట్టణ శివారులోని చింతపల్లి రోడ్డు వద్ద చోటుచేసుకుంది. మండలంలోని పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన వేముల సాగర్ (18) మంగళవారం ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి వేగాన్ని అదుపుచేయలేక బైకు అదుపుతప్పి లారీ కిందకు దూసుకెళ్లింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన సాగర్‌ను కారంపూడిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. ఎస్ఐ వాసు సంఘటనా ప్రదేశానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు అవివాహితుడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 520.90 అడుగులు ఉంది. 150.92 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7110 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో వాటర్‌గా 15,251 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీ శైలం నుంచి నాగార్జున సా గర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 6779 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

1,39,165 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,44,172 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,39,165 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 69,373 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10000	12000
334	9500	12600	బ్యాడిగి 355	10000	13000
నంబరు. 5	10000	13100	సింజెంటా		
273	10000	12600	బ్యాడిగి 5531	10000	12000
341	10000	14000	దేవనూరు డీలక్స్	10200	12500
4884	10000	11400	ఆర్మూరు	10000	11200
సూపర్ 10	--	--	తాలుకాయలు	5000	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10000	13100			

వచ్చే విద్యాసంవత్సరానికి తరగతి గదులు పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యాసంవత్సరం నాటికి మున్సిపల్ హైస్కూల్ తరగతి గదులు మొత్తం పూర్తి చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెగాపేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశానికి వచ్చిన సందర్భంలో ఇచ్చిన హామీ మేరకు బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న భవన సముదాయాన్ని పూర్తి చేసేందుకు కోటి 50 లక్షల రూపాయలు మంజూరు చేశారు. సర్వశిక్షాభియాన్ ద్వారా వాటిని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో మంగళవారం సర్వశిక్షాభియానాధికారులతో కలిసి ఎమ్మెల్యే స్కూల్‌ను సందర్శించారు. స్కూల్ 30 తరగతి గదులు పూర్తి చేయటంతోపాటు కిచెన్, డిన్నర్‌హాలు ఏర్పాటు చేయాలని సూచించారు. త్వరితగతిన పనులు ప్రారంభించి పాఠశాలు పునఃప్రారంభం నాటికి అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్షాభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.నాగిరెడ్డి, ఈఈ నాగజ్యోతి, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను పూర్తి చేసేందుకు అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

పిట్టలవానిపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా అర్హులైన 5 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మండల టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని చందోలుగ్రామపంచాయతీకి చెందిన మహమ్మద్ ముజాహిద్ బేగమ్‌కు రూ.3 లక్షలు, భవనవారిపాలెం గ్రామపంచాయతీకి చెందిన ఇంటూరు నాగలక్ష్మికి రూ.1,81,877, మండలంలోని కొత్తపాలెం గ్రామానికి అక్కల సీతామహాలక్ష్మికి రూ.51310, గోకరాజు, నల్లిబోయన వారిపాలెం గ్రామపంచాయతీలకు చెందిన కేశన వెంకటేశ్వర్లుకు రూ.21,500, అల్లూరు గ్రామపంచాయతీకి చెందిన ముసలారెడ్డి రూ.15 వేల చెక్కును అందజేశారు. వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, సకాలంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌వోసిలు లబ్ధిదారులకు అందించకుండా పేదల ప్రాణాలతో చెలగాటం ఆడిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, వివిధ గ్రామపంచాయతీలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆశీలు వసూళ్ళకు బహిరంగ వేలం

● కూరగాయల మార్కెట్ ద్వారా రూ.26.92 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, సిబ్బంది

బాపట్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పురపాలక సంఘానికి సంబంధించిన కూరగాయల మార్కెట్, సంత్రిమార్కెట్, మాంసం, చేపలమార్కెట్‌లు, జంతువధశాలలకు సంబంధించి ఆశీలు వసూళ్ళు చేసుకునేందుకు మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో పలువురు పాల్గొని పోటీపడ్డారు. ఈ వేలం పాటలో కూరగాయలు, సంత్రిమార్కెట్‌ను షేక్ జరీనాబేగం రూ.26లక్షల92వేలకు పాడుకున్నారు. చేపల మార్కెట్‌ను వేల్పుల కోటేశ్వరరావు రూ.5 లక్షల 15వేలకు పాడుకున్నారు. కూరగాయల మార్కెట్ లోపలి 1 నుంచి 76 స్టాల్స్ రోజువారి అద్దె వసూళ్ళు చేసుకొనుటకు, మాంసం, జంతువధశాల మార్కెట్‌ల పాటలను పాడుకునేందుకు ఎవరు ముందుకు రాకపోవటంతో వాటిని వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ జబ్బార్, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో బకాయి చెల్లించి 50 శాతం వడ్డీమాఫీ పొందవచ్చు

ఇంటిపన్ను, ఖాళీ స్థలాల పన్నులు బకాయిలతో సహా ఏకమొత్తంగా చెల్లించినట్లైతే వడ్డీలో 50 శాతం మాఫీ పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఇంకా పన్ను చెల్లించని వారు ఈ వడ్డీ మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పురపాలక సంఘంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో, వార్డు సచివాలయాలలో, ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించి తగు రశీదు పొందాలన్నారు. ఉగాది, రంజాన్‌పండుగ రోజుల్లో కూడా పన్ను చెల్లించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పట్టణంలోని పలువార్డులలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. జీబీసీ రోడ్డు, విశ్వబ్రాహ్మణ కాలనీ వద్ద పారిశుధ్య పనులను పరిశీలించి కార్మికులకు పలు సూచనలు చేశారు. వార్డులలో తప్పనిసరిగా డ్రైనేజీలను శుభ్రం చేయాలని చెప్పారు. రోడ్డుమార్జిన్‌లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలిగించాలన్నారు. దోమలబెడద ఎక్కువగా ఉన్నందున ప్రతిరోజు తప్పనిసరిగా ఫాగింగ్ చేయాలని చెప్పారు.

ముగిసిన సబ్‌జూనియర్స్ రాష్ట్ర బాలికల కోచింగ్ క్యాంప్

బాపట్ల,మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో 34వ సబ్ జూనియర్స్ ఆంధ్రప్రదేశ్ బాలికల కబడ్డీ జట్టు కోచింగ్ క్యాంప్ మంగళవారంతో ముగిసింది. వారం రోజులుగా నిర్వహిస్తున్న ఈక్యాంప్‌లో శిక్షణ పొందిన క్రీడాకారులు 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటారు. బాపట్ల కబడ్డీ క్లబ్ వారు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి చేతులమీదగా క్రీడాదుస్తులు వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.రాజేశ్వరి, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, పీడీ కత్తి శ్రీనివాసరావు, కబడ్డీ క్లబ్ నాయకులు ఎం.సుబ్బరాజు, టి.సాంబశివరావు, పి.నాగేశ్వరరావు, పి.శైలజ, వి.సాయికుమార్, రవికుమార్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

కార్పొరేషన్ రుణాలకు 85 మంది హాజరు : ఎంపీడీవో

కర్లపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్పొరేషన్ రుణమేళాకు 85 మంది హాజరయ్యారని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. కార్పొరేషన్ రుణాల కొరకు బీసీ, రెడ్డి, ఈడబ్ల్యూఎస్, కమ్మ, కాపు, క్షత్రియ, శాలివాహన కులస్థులు దరఖాస్తులు చేశారని యూనియన్ బ్యాంక్ మేనేజర్ మానస, చైతన్యగోదావరి బ్యాంక్ మేనేజర్ అన్‌బర్సన్, ఎస్‌బిఐ మేనేజర్‌లు సుధీర్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రజనీ, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం



మట్టిఖర్చులకు ఆర్థికసాయం అందజేస్తున్న పేరలి బాలకృష్ణమూర్తి ట్రస్ట్ సభ్యులు

కర్లపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరలి పంచాయతీ గొడపాలేనికి చెందిన బొలగాని వెంకటశివరావు మంగళవారం మృతి చెందాడు. పేరలి నరసయ్య, తిమ్మరాజుకృష్ణమూర్తి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేరలి బాలకృష్ణమూర్తి సహాయసహకారంతో మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. వెంకటశివరావు మృతి బాధాకరమని డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో గేరా ఏసుబాబు, విజయరాజు, కాటూరి చిన్ని, బొలగాని సాంబయ్య, మేకల విక్టర్, రత్నరాజు, ఈవూరి శ్రీనివాసరావు ఉన్నారు.

సచివాలయానికి కూలర్ వితరణ

కర్లపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో సచివాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చటానికి తమ కుమారుడు రెడ్డిబత్తుని వెంకటేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం వెంకటసుబ్బమ్మ, కోటిరెడ్డి దంపతులు మంగళవారం సచివాలయానికి కూలర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కూలర్‌ను అందజేసిన దంపతులను సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, గుర్రపుసాల జగ్గయ్య ప్రత్యేకంగా అభినందించారు.



హార్బర్‌లో చురుగ్గా సాగుతున్న సైడ్ రివిట్‌మెంట్ పనులు



హార్బర్‌లో లైట్‌హౌస్ వైపు 80 శాతం పూర్తయిన సైడ్ రివిట్‌మెంట్ పనులు

హార్బర్‌లో.. పనులు పరుగు

● నిజాంపట్నంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
● గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి
● సైడ్ రివిట్‌మెంట్ నిర్మాణాలు 70 శాతం పూర్తి
● పనులపై పది నెలలుగా మంత్రి అనగాని సమీక్షలు



హార్బర్ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన రిటైనింగ్‌వాల్

రేపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రచారానికే పరిమితమైన నిజాంపట్నం హార్బర్ పనులు గత పది నెలలుగా పరుగులు తీస్తున్నాయి. గత ప్రభుత్వం హార్బర్‌పై దృష్టి సారించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే అన్న చందంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం సాగరమాల ప్రాజెక్టు కింద 2022లో హార్బర్‌కు విస్తరణ నిర్మాణ పనులకు రూ.451 కోట్లు నిధులు కేటాయించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం కేంద్ర పర్యావరణ అనుమతులు పొందకుండా హడావుడిగా పనులు శ్రీకారం చుట్టింది. అనుమతులు లేకపోవడంతో సగంలోనే నిలిపివేశారు. ఈ పరిస్థితుల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు హార్బర్ అభివృద్ధిపై హామీలు ఇచ్చారు. తీరప్రాంతం నుంచి భారీగా మత్స్య ఎగుమతులు ఉత్పత్తి చేస్తామన్నారు. తాము అధికారంలోకి రాగానే హార్బర్ నిర్మాణం చేపట్టి మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే పాలకులు హార్బర్‌లో పనులను వేగవంతం చేశారు. గత పదినెలలుగా మంత్రి అనగాని సత్యప్రసాద్ హార్బర్ నిర్మాణ పనులపై ఎప్పటికప్పుడు అటు అధికారులతో ఇటు కాంట్రాక్టర్లతో సంప్రదింపులు చేస్తున్నారు. త్వరితగతిన పూర్తిపై సమీక్షిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. అదేవిధంగా హార్బర్ అభివృద్ధిపై కేంద్ర మత్స్యశాఖామంత్రితో మంత్రి అనగాని ప్రత్యేకంగా సంప్రదిస్తున్నారు. జెట్టీ విస్తరణతో పాటు మౌలిక వసతుల కల్పనకు అవసరమైన రిజర్వు భూమిని కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖతో అనుమతులు పొంది పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ నిధులపై నివేదిక ఇచ్చి త్వరితగతిన హార్బర్ అభివృద్ధి పనులు పూర్తికి కేంద్ర సహాయాన్ని కూడా అనగాని కోరారు. ఈ పరిస్థితుల్లో హార్బర్‌లో సైడ్‌రివిట్‌మెంట్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. హార్బర్‌కి రెండువైపులా సైడ రివిట్‌మెంట్ నిర్మాణాలు 70 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

సమగ్ర పోషక యాజమాన్యంతో భూమి సారవంతం

● అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుశీల

బాపట్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సమగ్రపోషక యాజమాన్యం ద్వారా పర్యావరణాన్ని, నేలసారవంతాన్ని కాపాడుకోవచ్చు అని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుశీల తెలిపారు. కళాశాలలోని మృత్తిక శాస్త్రవిభాగం ఆధ్వర్యంలో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మృత్తిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.లత అధ్యక్షత వహించగా సుశీల మాట్లాడుతూ గ్రీన్ రెవల్యూషన్ తర్వాత పెరిగిన హైబ్రీడ్ వెరైటీలు గురించి తెలియజేశారు. డాక్టర్ లత మాట్లాడుతూ నేల సూక్ష్మజీవులు, భూసారపరీక్ష, సేంద్రియ ఎరువులు, వానపాము ఎరువులు, వేపపిట్టు, పశువుల ఎరువుల ప్రాముఖ్యతను తెలియజేశారు. సమగ్ర పోషక యాజమాన్యంలో ఉన్న ముఖ్యమైన 5 పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హేమ పాల్గొని శిక్షణ ఇచ్చారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక అతిథి ఉపన్యాసాలు

విద్యార్థి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాలలో ముగ్గురు విశిష్ట వ్యక్తులచే మంగళవారం అతిథి ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు. ఏపీఈడీఏ, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ పెద్దస్వామి విద్యార్థులకు తమ సంస్థ నిర్వహించే వ్యవసాయోత్పత్తులు గురించి, ఎగుమతిదారులకు కల్పించే రుణసదుపాయం గురించి వివరించారు. గుంటూరు మార్కెటింగ్‌కు సంబంధించి రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య వివిధ మార్కెటింగ్ అంశాలు, ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ విభాగం గురించి విద్యార్థులకు వివరించారు. భారత ఆహార సంస్థ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ డాక్టర్ రాంప్రసాద్ ఆహార ధాన్యాల ధరల స్థిరీకరణలో తమ సంస్థ చేపడుతున్న గణనీయమైన పాత్ర గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.హైమాజ్యోతి, డాక్టర్ కె.ఎస్.ఆర్.పాల్, డాక్టర్ కె.సుశీల్, డాక్టర్ బి.అపర్ణ, డాక్టర్ వి.సీతారాంబాబు పాల్గొన్నారు.

సేంద్రియ చిరుధాన్యాలపై మహిళా శిక్షణ

బాపట్ల వ్యవసాయ కళాశాలలో సేంద్రియ చిరుధాన్యాలపై మహిళా శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నేటి తరం కంటే పూర్వతరంలో మనుషులు ఎంతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని అనుభవించారని, నాడు ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవటం వల్ల శారీరక ధృఢత్వం కలిగిందని డాక్టర్ చెరుకూరి శ్రీనివాసరావు తెలిపారు. వ్యవసాయ కళాశాల జన్యుశాస్త్రం, వృక్షప్రజనన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి అధ్యక్షత వహించగా వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసులు జన్యుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ లాల్ అహ్మద్ మహ్మద్, డాక్టర్ ఎం.సురేష్‌కుమార్, డాక్టర్ టి.మధుమతి, డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ పి.తుషార తదితరులు పాల్గొని మహిళా రైతులకు శిక్షణ ఇచ్చారు.

విలువ ఆధారిత ఉత్పత్తులపై...

ఆహారంలో పండ్లు, కూరగాయలను తీసుకోవటం వల్ల శారీరంలో సమతుల్యం పాటించడుతుందని తద్వారా ఆరోగ్య సమస్యలు సంభవించవని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రసూనా రాణి తెలిపారు. కళాశాలలో గోపాపురం గ్రామరైతులకు ఇండియన్‌కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఎస్సీ సబ్ ప్లాన్‌లో భాగంగా నిర్వహించిన విలువ ఆధారిత ఉత్పత్తుల శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని తాజా పండ్లు కూరగాయలను వినియోగించటంలో లాభాలను వివరించారు. ఉద్యానవన విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీలత విలువ ఆధారిత పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ ఎన్.రత్నకుమారి, డాక్టర్ కె.సుశీల పాల్గొన్నారు.

అల్లూరు, ఖాజీపాలెంపాలెంలో 'పొలం పిలుస్తుంది'

పిట్టలవానిపాలెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు, ఖాజీపాలెం రైతు సేవా కేంద్రాలలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి సీహెచ్ సత్యానంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏడీఏ ఎ.లక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని పొలంబడి కార్యక్రమాలు గురించి రైతులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటా పెసలు రూ.8,682, మినుము క్వింటా ధర రూ.7,400 రబీ 2024 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వపరంగా ప్రకటించినట్లు ఏడీఏ లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా రైతు సేవ కేంద్రాల సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెదుళ్ళపల్లి హైస్కూల్‌లో స్కౌట్ అండ్ గైడ్స్ ట్రూప్‌లు ఏర్పాటు

బాపట్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెదుళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రూప్‌లను ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు సి.జయకుమార్ 26 మందికి మంగళవారం యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. స్కూల్ ఉపాధ్యాయులు 22 మందికి యూనిఫామ్‌లు సమకూర్చారు. మొత్తం 24 మంది స్కౌట్స్, 24 మంది గైడ్స్‌తో ఏర్పాటైన కార్యక్రమంలో ఎంఈవో ఎస్.నిరంజన్, స్టేట్ స్కౌట్ ట్రైనింగ్ ఆఫీసర్ డివిఎల్ నారాయణ, జిల్లా ఆర్గనైజర్ బి.రవీంద్రనాథ్‌లు పాల్గొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ జి.శివశంకర్, గైడ్ కెప్టెన్ డి.సుప్రియ, సీనియర్ మాస్టర్ డి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటిపారుదల శాఖపై సమావేశం

వేమూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరు మండలం కూచిపూడి లాకుల వద్ద ఉన్న నీటి పారుదల శాఖ కార్యాలయంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు ఆ శాఖకు సంబంధించిన సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా విచ్చేస్తారని ఆయన సమక్షంలో అధికారులకు సమస్యలను వివరించి తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కూచిపూడి ఇరిగేషన్ కార్యాలయం వద్ద...

అమృతలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిదిలోని కూచిపూడి ఇరిగేషన్ కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని నీటిపారుదల డిస్ట్రిబ్యూటరీ కమిటీ, ఇరిగేషన్ శాఖ, డ్రైనేజ్ శాఖ అధికారులతో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బుధవారం ఉదయం సమావేశం నిర్వహించనున్నారు. నియోజకవర్గ పరిధిలోని డీసీలు, టీసీలు, ప్రాజెక్టు కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

వ్యవసాయ భూములకు పట్టాలు ఇవ్వాలి : సీపీఎం

కొల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : లంక గ్రామాల్లోని రైతుల స్వాధీనంలో ఉన్న వ్యవసాయ భూములకు పట్టాలు, శ్మశాన వాటిక లేని దళితవాడలకు స్థలాలు కేటాయించాలని సీపీఎం నాయకులు కోరారు. మండల పరిధి గ్రామాల్లో వారం రోజులుగా సీపీఎం ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి పలు సమస్యలు బృంద సభ్యులు తెలుసుకున్నారు. వింతతు, వృద్ధాప్య పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని, పోతార్లంక, గాజుల్లంక గ్రామాల్లో ఉన్న భూములకు సంబంధించి సాగులో ఉన్న రైతులను గుర్తించి సర్వే, సబ్ డివిజన్ చేసి పట్టాలు, పాసు పుస్తకాలు అందజేయాలన్నారు. జువ్వలపాలెం ఇసుక క్వారీ కూడా ప్రారంభించి కూలీలకు ఉపాధి కల్పించాలని, అన్ని గ్రామాల్లో దళిత వాడలకు శ్మశాన స్థలాలు కేటాయించాలన్నారు. ఆయా ప్రజా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో కె.నరసింహారావు, డీటీ శ్రీనివాసరావులకు వారి కార్యాలయాల్లో అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.కృష్ణమోహన్, మండల కార్యదర్శి వి.వెంకట్రామయ్య, సభ్యులు టి.సురేష్, నాగమల్లేశ్వరరావు, అగ్గిరామయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల అర్జీల పరిశీలన

చుండూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గతంలో మరుగుదొడ్ల నిర్మాం కోసం దరఖాస్తులు పెట్టుకున్న అర్జీలను పరిశీలించి వాటి నిర్మాణాలకు చర్యలు తీసుకోబోతున్నట్లు ఎంపీడీవో ఎస్.సుదీప మంగళవారం తెలిపారు. మండలంలో 657 మంది గతంలో దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పునఃపరిశీలించి అర్హులైన వారిని గుర్తించి ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా వాటి నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు.

మాజీ ఎంపీపీ కృపానందం మృతి



కృపానందం(ఫైల్)

కొల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీపీ అమృతలూరి కృపానందం (85) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. మండల పరిధిలోని ఆవులవారిపాలెం గ్రామానికి చెందిన కృపానందం సీపీఎం నాయకుడిగా ఎన్నో ఉద్యమ పోరాటాలలో పాలు పంచుకుని ప్రజల పక్షాన నిలిచి సేవలు అందించారు. కృపానందం మృతదేహాన్ని సందర్శించి పార్టీ నాయకులు ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని కొల్లూరు మండల సిపిఎం నాయకులు కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతి తెలిపారు. ఆవులవారిపాలెంలో బుధవారం ఉదయం ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం

అమృతలూరు, మార్చి 25 (అంధ్రజ్యోతి) : ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్థానిక పెన్షనర్స్ భవనంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవగాహన నిధులతో భారతీయ రిజర్వ్ బ్యాంకు, ఆవార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు మాట్లాడుతూ బ్యాంకుల సహకారంతో మహిళలు ఆర్థికంగా ఎదగడానికి దోహదపడతాయన్నారు. ఎస్‌బిఐ జానకి అమర్ వర్ధన్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ళ పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. బ్యాంకు అధికారులు మాట్లాడుతూ ఖాతాదారులు సిబిల్ స్కోర్ పెంచుకోవాలని, కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల్లో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమృతలూరు, గోవాడ యూనియన్ బ్యాంకు మేనేజర్లు రవీంద్రబాబు, చక్రపాణి, సీజీజీబీ మేనేజర్ స్వాతి, ఏపీఎంలు రాంబాబు, త్యాగరాజు, అవార్డు సంస్థ సెక్రటరీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు ఉంటేనే మద్దతు ధర : ఏవో

చుండూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పెసలు, మినుములకు మార్క్‌ఫెడ్ కనీస మద్దతు ధరలు ప్రకటించింది. ఈ పంటలకు మద్ధతు ధర లభించాలంటే నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఏవో ఆదాంబాబు మంగళవారం తెలిపారు. క్వింటా పెసలు రూ.8682, మినుము రూ.7400లు ప్రకటించింది. ఈ ధర పొందాలంటే తేమ శాతం 12 లోపు, వాటిలో దెబ్బతిన్న గింజలు, ఇతర పంట గింజలు, రంగు మారిన గింజలు, పాక్షికంగా దెబ్బతిన్న గింజలు, పురుగుబడిన గింజలు లాంటివి 3 శాతం లోపు ఉండాలన్నారు. ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులకు ఈ అవకాశం ఉంటుందన్నారు.

పంచాంగ గ్రంథాన్ని ఆవిష్కరించిన మంత్రి మనోహర్



విశ్వవసునామ పంచాంగ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : విశ్వవసునామ సంవత్సర పంచాంగ గ్రంథాన్ని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించారు. తెనాలిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం భట్టిప్రోలు గ్రామానికి చెందిన వాస్తు, జ్యోతిష్యులు, పంచాంగ శ్రవణ కర్త వంగర చలమయ్య పరిగణితము చేసి ముద్రించిన పంచాంగ గ్రంథాన్ని మంత్రి ఆవిష్కరించారు. చలమయ్య సిద్ధాంతి ప్రతి ఏడాది ఉగాదిని పురస్కరించుకుని పంచాంగ గ్రంథాలను రచించి భక్తులకు పంపిణీ చేయడంతో పాటు పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేయడం అభినందనీయమని మంత్రి మనోహర్ అన్నారు. కార్యక్రమంలో జనసేన వీరమహిళ తాడిపర్తి విజయనాగలక్ష్మి, వంగర సత్యప్రసాద్ పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి : ఆలపాటి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి

వేమూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం పెంచాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. మండలంలోని పెరవలి గ్రామంలో ఎన్నారై సీడ్స్ హైబ్రిడ్ మొక్కజొన్న విత్తన రకం గరుడ క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ విత్తన సస్యరక్షణ, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎన్నారై సంస్థ ఉపాధ్యక్షుడు కాకుమాను సాంబశివరావు మాట్లాడుతూ, అన్ని రకాల వరి, మినుము పెసర, కంది, మొక్కజొన్న, జొన్న, కూరగాయ విత్తనాలు ఎన్నారై సంస్థ అందిస్తుందన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, నీటి సంఘం అధ్యక్షుడు శేషగిరి, లక్ష్మణరావు, బసవయ్య పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత



బాధితులకు చెక్కును అందజేస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4,17,753 లు మంజూరయ్యాయని టీడీపీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వైద్యం చేయించుకోలేని పేదలకు రెవెన్యూశాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ అండగా ఉంటూ ముఖ్యమంత్రి సహాయనిధి కింద వైద్య ఖర్చుల కోసం ఐదుగురికి రూ.4 లక్షల 17వేల 753లు మంజూరు చేయించటం జరిగిందని, బాధితులకు చెక్కులను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటి చైర్మన్ పంతాని మురళీధర రావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ మత్తి భాస్కరరావు పాల్గొన్నారు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల్లో రాయితీ

రేపల్లె, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘ పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను ఏకమొత్తంలో చెల్లించిన వారికి 50 శాతం వడ్డీమాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవోను విడుదల చేసిందని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ జీవో ఎంఎస్ నెం.46 పన్నుల రాయితీ జీవోను విడుదల చేయటం జరిగిందన్నారు. పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలను, ఆర్థిక సంవత్సరం బకాయిలపై విధించిన వడ్డీని వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌గా మాఫీ చేయటం జరుగుతుందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏకకాలంలో బకాయి చెల్లిస్తే 50 శాతం వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు.

నాణ్యమైన రొయ్య పిల్లలను అందించాలి

రేపల్లె, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రొయ్య పిల్లల యాచరీస్‌లో నాణ్యమైన పిల్లలు ఉత్పత్తి చేసే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు పిన్ని సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రొయ్యపిల్లలను ఉత్పత్తిచేసే యాచరీస్‌లో నాణ్యమైన పద్ధతులను పాటించటంలేదని దాని కారణంగా ఆక్వారైతులు తీవ్ర నష్టాలబాట పడుతున్నారని పిల్లలను కొనుగోలు చేసి చెరువుల్లో వేయటంతో నాణ్యమైనవికాక చనిపోతున్నాయని దీనివల్ల ఆర్థికంగా దెబ్బతింటున్నారన్నారు. ఇప్పటికైన మత్స్యశాఖాధికారులు యాచరీస్‌పై ప్రత్యేక దృష్టిసారించి ఆయా యాచరీస్‌లను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యాజమాన్యానికి తెలపాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న యాచరీస్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు

నగరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాలుగవ విడత చలానా వివరాలను పరిశీలించి కార్యాలయ పరిధిలోని అన్ని రికార్డులను క్రమంగా నిర్వహించాల్సిన అవసరంపై ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ పరిధిలోని కేసులు, పెండింగ్‌లో ఉన్న దర్యాప్తు కేసులను సమీక్షించారు. రికార్డులన్నింటిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న నవోదయ 2.0 కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం స్టేషన్ పరిధిలోని లైసెన్స్‌దారులతో సమావేశం నిర్వహించి షాపుల నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మాటూరి శ్రీరామ్‌ప్రసాద్, లైసెన్స్‌దారులు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, ఉద్యోగులకు బకాయిల నిధులు మంజూరు హర్షణీయం

వేమూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను మంజూరు చేయడం హర్షణీయమని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్ అన్నారు. ఆయన వేమూరులో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రావిడెంట్ ఫండ్‌కు సంబంధించి రూ.2400 కోట్లు, ఏపీజీఎల్ ఏపీ జీఎల్‌ఐ కింద రూ.1800 కోట్లు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల కింద రూ.2500 కోట్లు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులకు నిధులను కూడా మంజూరు చేయాలన్నారు.

దివ్యాంగులకు.. శాశ్వత కార్డు





దివ్యాంగులకు జారీ చేస్తున్న యూనిక్ ఐడీ కార్డులు

- యూనిఫైడ్ ఐడీ పేరుతో గుర్తింపు కార్డు అందించేలా కేంద్రం శ్రీకారం
- ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- మీ సేవ, ఇంటర్నెట్ సెంటర్‌లలో దరఖాస్తు చేసుకునే అవకాశం
- కార్డులు నేరుగా ఇంటికే పంపుతున్న ప్రభుత్వం
- యూడీఐడీ పోర్టల్‌తో సదరం సేవలు కూడా సులభతరం

గుంటూరు(తూర్పు), మార్చి 25(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక, అంధులకు కేంద్రం శుభవార్త చెప్పింది. శాశ్వత గుర్తింపు కార్డు జారీకి కేంద్రం శ్రీకారం చుట్టింది. గతంలో దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంద జేసే సంక్షేమ పథకాలకు సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. దీనికోసం సచివాలయాల్లో సదరం స్లాట్ బుక్ చేసుకున్న వారికి ప్రభుత్వం నిర్దేశించిన వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి వైకల్య శాతాన్ని నిర్ణయించి వైద్యులు సర్టిఫికెట్లు జారీ చేసేవారు. ఈ సర్టిఫికెట్‌తో బస్సు, రైల్వే పాస్‌లకు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేవారు. అంతేగాక ఉద్యోగాల ఇంటర్వ్యూల సమయంలో సర్టిఫికెట్‌తో పాటు ఆధార్, ఇతర గుర్తింపు కార్డులు తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి సమస్యలకు చెక్ పెడుతూ వీటి స్థానంలో మొత్తంగా కేంద్రం యూడీఐడీ(యూనిఫైడ్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు) ఒకే కార్డు తీసుకొచ్చింది. దీనికి సంబంధించిన ప్రక్రియ జిల్లాలో మొదలైంది.

దరఖాస్తు.. ఇలా చేసుకోవాలి

మీ సేవ, ఇంటర్‌నెట్, మొబైల్ ఆన్‌లైన్‌లో స్వావలంబన్‌కార్డు. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి, అందులో అప్లయ్ బటన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే దరఖాస్తుకు సంబంధించిన సూచనలు ఉంటాయి. సూచనలను అంగీకరిస్తూ సబ్‌మిట్ క్లిక్ చేస్తే ఫారం ఓపెన్ అవుతుంది. ఫామ్‌లో ఉన్న అంశాలను క్షుణ్ణంగా చదివి సమాచారాన్ని నింపడంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తి అవుతుంది. కావాలంటే దరఖాస్తు స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకునే వెసులుబాటును కల్పిస్తుంది.

యూనిక్ ఐడీతోనే గుర్తింపు

భవిష్యత్తులో యూనిక్ ఐడీని తప్పనిసరి చేయాలని కేంద్రం భావిస్తున్నది. మిగిలిన రాష్ట్రాల్లో కూడా ఈ గుర్తింపుకార్డుతో ప్రయాణాల్లో రాయితీలు పొందవచ్చు. అంతేగాక రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఈ కార్డు ద్వారా అందుకోవచ్చు. ఈ కార్డులో ఆధార్, వైకల్య శాతం, ఇతర వివరాలను పొందుపరు స్తున్నారు. ఈ ఐడీని స్కాన్ చేస్తే పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. ఇప్పటివరకు సదరం సర్టిఫికెట్లు మన రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఐడీ కార్డులు మాత్రం దేశ వ్యాప్తంగా చెల్లుబాటు అవుతుంది.

2014లోనే ఈ ఆలోచనకు శ్రీకారం

వాస్తవానికి 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టింది. సదరం సర్టిఫికెట్ స్థానంలో ప్రత్యేక కార్డులను ప్రవేశపెట్టింది. ఈ కార్డులను జిల్లా విభిన్న ప్రతిభావంతుల కార్యాలయానికి పంపారు. అవి డీఆర్‌డీఏ శాఖకు అప్పజెప్పగా, వాటి బాధ్యత మెప్మాకు అప్పజెప్పారు. మెప్మా అధికారులు కొంతమందికి పంపిణీ చేసి, మిగిలిన వారికి ఇవ్వలేదు. కాకపోతే ఈ కార్డులో వైకల్యంశాతం మినహా మిగిలిన వివరాలను పొందుపరచకపోవడంతో ఈ కార్డులపై లబ్ధిదారులు ఆసక్తి చూపించలేదు. ప్రస్తుతం ఈ విధానాన్ని అప్‌డేట్ చేసి స్మార్ట్‌కార్డులను కేంద్రం తీసుకువచ్చింది.

సులభం...సదరం

కేంద్రం తీసుకొచ్చిన యూడీఐడీ పోర్టల్‌తో సదరం సేవలను కూడా అందజేస్తుంది. నూతనం విధానంతో సదరం సులభతరం చేసింది. ఈ పోర్టల్ ద్వారా సదరం శిబిరాలు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారికి సదరం శిబిరాలకు సంబంధించిన వివరాలు వారి ఫోనుకు సమాచారం వస్తుంది. వైద్య పరీక్షలకు ఎక్కడికి రావాలి... ఎప్పుడు రావాలి అనే విషయాలను ఎస్ఎమ్ఎస్ ద్వారా పంపుతారు. గతంలో ఆన్‌లైన్ ద్వారా 5రకాల వైకల్యాలకు సంబంధించిన వ్యాధులకు సదరంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం యూడీఐడీ పోర్టల్‌లో 18రకాల వైకల్యాలను చేర్చారు. వాటిలో న్యూరో సంబంధిత బాధితులు, తలసీమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యాధి నిర్ధారణ పూర్తయిన తరువాత కార్డుల రూపంలో నెల రోజులలోపు నేరుగా తపాలా కార్యాలయం ద్వారా ఇంటికే పంపుతున్నారు. చిరునామా సరిగ్గా లేకపోవడం, లబ్ధిదారుడు అందుబాటులో లేకపోతే ఈ కార్డులు కొన్ని చోట్ల స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా తపాలా కార్యాలయాల వద్ద ఉంచుతున్నారు. ఐడీ నెంబర్ చెబితే కార్డును తీసుకోవచ్చు.

కేంద్రం ఆలోచన అభినందనీయం



దివ్యాంగులు పడుతున్న కష్టాన్ని చూసి గుర్తింపు కార్డు ఇవ్వాలనే కేంద్రం ఆలోచన అభినందనీయం. గతంలో ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాలంటే ఇబ్బంది పడేవాళ్లం. కేంద్రం ఆలోచనతో ఉమ్మడి జిల్లాలో ఉన్న లక్షా ఇరవై వేల మందికి లబ్ధి చేకూరుతుంది. ఇతర రాష్ట్రాల్లో కూడా చెల్లుబాటు అయ్యేలా కార్డు రూపొందించడం సంతోషంగా ఉంది. దరఖాస్తు చేసుకుని కార్డులు అందని వారు నేరుగా పోస్టల్ కార్యాలయాల్లో సంప్రదించాలి.

వై నరసింహారావు, విజువల్లీ ఛాలెంజ్‌డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, జిల్లా అధ్యక్షుడు

శాశ్వత ఐడీ తప్పనిసరి



భవిష్యత్తులో యూనిక్ ఐడీ తప్పనిసరి. జిల్లాలో ఉన్న దివ్యాంగులు విధిగా దరఖాస్తు చేసుకోవాలి. కేంద్రం తీసుకువచ్చిన యూడీఐడీ పోర్టల్ ద్వారా సదరం సేవలను పొందవచ్చు.

సువార్త, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల జిల్లా శాఖ, ఏడీ

ఎంపీపీ ఎన్నికలపై జడ్పీ సీఈవో సమీక్ష


సమావేశంలో పాల్గొన్న జడ్పీ సీఈవో జ్యోతి బసు

గుంటూరు సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని తొమ్మిది మండల పరిషత్‌ల్లో ఈ నెల 27న జరగనున్న ప్రత్యేక ఎన్నికల కార్యక్రమంపై జడ్పీ సీఈవో వీ జ్యోతి బసు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో-ఆప్షన్ మెంబర్ల ఎన్నికలకు సంబంధించి చేయవలసిన ఏర్పాట్లపై జ్యోతి బసు ఎంపీడీవోలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన శిక్షణ కూడా ఇవ్వటం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి గురజాల డీఎల్‌డీవో గబ్రూ నాయక్, పెదకాని ఈవోపీఆర్‌డీ కే శ్రీనివాసరావు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి పిట్టలవానిపాలెం, భట్టిప్రోలు, దుగ్గిరాల, గుంటూరు రూరల్, తెనాలి, అచ్చంపేట, కారంపూడి, నరసరావుపేట, ముప్పాళ్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఎన్నికల నిర్వహణకు జిల్లా కలెక్టర్లచే నియమించబడిన ప్రిసైడింగ్ అధికారులు హాజరయ్యారు.

నాటి హామీ నేడు అమలు

(5వ పేజీ తరువాయి)

మున్సిపాల్టీలో అభివృద్ధిని గాలికొదిలేసిందని జీవీ ఆంజనేయులు ఆరోపించారు. నాడు టీడీపీ ప్రభుత్వం రూ.161 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టగా వైసీపీ వాటిని నిలిపేసిందని విమర్శించారు. తాజాగా ఆ పథకాన్ని తాము అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ పథకం పూర్తితో పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. 102.60 లక్షలతో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ద్వారా ప్రజలు వారి సమస్యలు తన దృష్టికి తీసుకురాగా వాటిఇని పరిష్కారిస్తున్నామన్నారు. ఆంధ్రజ్యోతి వేదికగా ప్రజలు కోరిన పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ నిధులు రూ.3 కోట్లను విడుదల చేసిందని వాటితో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఏబీఎస్ ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంతో ప్రజలకు ప్రజాప్రతినిధులు.. అధికారుల మధ్య అవినాభావ సంబంధం పెరుగుతుందన్నారు. సమస్యల్ని అధికారులు.. ప్రజా ప్రతినిధులు స్పష్టంగా అర్థం చేసుకోవడానికి.. వాటి పరిష్కారానికి అవకాశం కలుగుతుందన్నారు. ఇటువంటి వినూత్న కార్యక్రమం చేపట్టిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చైర్మన్ వేమూరి రాధాకృష్ణకు ప్రత్యేక అభినందలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ దస్తగిరి, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు వాసిరెడ్డి లింగమూర్తి, నన్నేసా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ లెనిన్‌కుమార్, నాగ శ్రీను, నిశ్శంకర శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల వేళ.. పెరిగిన కోతలు

(5వ పేజీ తరువాయి)

ఉండని పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎప్పుడు విద్యుత్ సరఫరా ఉంటుందో, పోతుందో తెలియని పరిస్థితులున్నాయి. సాంకేతిక కారణాలని అధికారులు పైకి చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యుత్‌శాఖ వైఫల్యంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సెక్షన్ల పరిధిలో విద్యుత్‌లైన్‌ల నిర్వహణ కోసం లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) పేరుతో రోజుల తరబడి పనులు చేస్తుండటం కూడా ప్రజల్లో అసహనం కలిగిస్తోంది. ప్రతి నెలలో రెండో శనివారం విద్యుత్‌లైన్‌ల నిర్వహణ కోసం విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉదయం నుంచి మధ్యాహ్నం, కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం వరకు విద్యుత్ సిబ్బంది పనులు చేస్తున్నారు. అది చాలదన్నట్లు సాధారణ రోజుల్లోనూ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతోన్న వేసవితో గుంటూరు సర్కిల్ పరిధిలోని ఐదు మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం పెరిగింది. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌లో దాదాపు 15 మిలి యన్ యూనిట్లపైనే విద్యుత్ వినియోగం జరుగుతుంది. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి ఉన్నప్పటికీ అంతరాయాలు రావటం అధికారుల వైఫల్యానికి అద్దం పడుతోంది.

స్టోర్స్‌లో పరికరాల్లేవంటూ విమర్శలు....

విద్యుత్ లైన్‌లకు సంబంధించి 11 కేవీ తీగెలు, స్విచ్‌లు, ఎర్త్ వైర్లు, కండక్టర్‌లు, కేబుల్స్ వంటివి సెక్షన్ కార్యాలయాల పరిధిలో అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని సెక్షన్‌ల పరిధిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నా పట్టించుకున్న నాధుడే ఉండటం లేదని సిబ్బంది వాపోతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాపం ఇప్పుడు శాపంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సెక్షన్‌లలో ఒకరు మాత్రమే లైన్‌మెన్ ఉండటం కూడా విద్యుత్ అంతరాయాలకు కారణాలుగా చెబుతున్నారు.

90 శాతం టెండర్లు.. 15 రోజుల్లో పనులు

తుళ్లూరు, మంగళగిరి, గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని వైసీపీ చేస్తున్న వాదన సరైనది కాదు. ప్రజలపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా రాజధాని నిర్మాణం చేపడుతున్నాం. రాజధాని నిర్మాణం పూర్తయితే భూముల విలువ పెరుగుతుంది. సంపద సృష్టి జరుగుతుంది. దానితో రాజధాని కోసం చేసిన రుణాలను తీర్చవచ్చు..' అని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారాయణ స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో మంగళవారం ఆయన పర్యటించారు. నిర్మాణంలో ఉన్న కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల భవనాలు, సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని పరిశీలించారు. రాయపూడి రెవెన్యూలో నిర్మాణంలో ఉన్న శాఖాధిపతుల బంగ్లాలను పరిశీలించారు. అనంతరం సీఆర్డీఏ జోనల్ కార్యాలయాన్ని సందర్శించారు. పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని కెసీపీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. పనులలో జాప్యం జరిగితే సహించేది లేదని మంత్రి వారికి సూచించారు. ఏప్రిల్ 20కి ఆరు అంతస్థులకు నాలుగు అంతస్థులు పూర్తి చేసి అప్పచెపతామన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పునర్నిర్మాణ పనులకు సంబంధించి 90 శాతం టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. క్లీనింగ్‌తో మొదలైన పనులు మరో 15 రోజుల్లో కాంట్రాక్టర్లకు మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని, ఆ తర్వాత పూర్తిస్థాయిలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యదర్శి ప్రధాన కార్యదర్శుల భవనాలు పరిశీలించామని, 186 భవనాలు మంత్రులు, హైకోర్టు జడ్జీలు, కార్యదర్శులు ప్రధాన కార్యదర్శులకు అందుబాటులోకి తెస్తామన్నారు. వాటితోపాటు గెజిటెడ్ అధికారులకు 1440, ఎన్జీవోలకు 1,995 ప్లాట్ల నిర్మాణాలు పూర్తవగా, 16.85 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైకోర్టు భవనం, 250 మీటర్ల ఎత్తులో వ్యూ పాయింట్ ఉండేలా అసెంబ్లీ భవనం వస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల అమరావతిని పాడుపెట్టడంతో పాటు రాజధాని పనులను సమస్య జఠిలం చేసిందని మంత్రి తెలిపారు. నిర్మాణ సంస్థలకు బిల్లులు ఇవ్వకుండా తరిమేసిందని, వాటిని క్లియర్ చేసి నూతనంగా పనులకు టెండర్లు కేటాయిస్తున్నామన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు పూర్తి చేస్తామన్నారు. లండన్‌కు చెందిన నార్మన్ ఫాస్టర్ కంపెనీ ఐకానిక్ టవర్ల డిజైన్ తయారు చేసినట్లు చెప్పారు.

రంగంలోకి కాంట్రాక్టు సంస్థలు.. చురుగ్గా పనులు

అమరావతి నిర్మాణ పనులపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రభుత్వ భవనాలను ఏడాదిలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు ముందస్తుగానే డెడ్‌లైన్‌ను విధించింది. నిర్ణీతగడువులోగా నిర్మాణ పనులను పూర్తిచేసి అప్పగించాల్సిందేనని ప్రభుత్వం స్పషం చేసింది. దీంతో కాంట్రాక్టు ఏజెన్సీలు పనులకు సంబంధించి ఉత్తర్వులను అందుకుందే ఆలస్యంగా క్షేత్రస్థాయిలోకి దిగిపనులను ముమ్మరంగా జరిపిస్తున్నాయి. ఈ క్రమంలో మంత్రులు, జడ్జీల తాలూకు బంగ్లాలతోపాటు, ఏఐఎస్, ప్రిన్సిపల్ కార్యదర్శుల బంగ్లాలను త్వరితగతిన పూర్తిచేసే లక్ష్యంతో కాంట్రాక్టు ఏజెన్సీలు తమతమ యంత్రాంగాన్ని రంగంలోకి దించాయి. సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనం దాదాపు ప్రారంభ దశకు చేరుకుంటుండగా, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్సెస్ లాబొరేటరీ భవనసముదాయం పనులు చాలా వరకు పూర్తయ్యాయి. 2019 నాటికి మొదలుపెట్టి చాలావరకు పూర్తయిన ప్రభుత్వ క్వార్టర్స్ పనుల పూర్తికి కాంట్రాక్టు సంస్థలు రంగంలోకి దిగాయి. ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలకు రూ.411.37 కోట్లు, మంత్రులు, న్యాయమూర్తుల విల్లాలకు రూ.401.37 కోట్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లకు రూ.300 కోట్ల వంతున ఖర్చు చేస్తున్నారు.

అమరావతిలో ప్రభుత్వ భవనాల పనుల పరిశీలనలో మంత్రి నారాయణ


కార్యదర్శుల భవనాల వద్ద మంత్రి నారాయణ

మిర్చి రైతుల నిరసన

ధర తగ్గించడంతో రోడ్డెక్కిన రైతులు

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు వివిధ ప్రాంతాల నుంచి ఎండుమిరపకాయలు అమ్ముకొనేందుకు వస్తున్న రైతులకు ఇక్కడి వ్యాపారస్థులు తీవ్ర మనోవేదన కలిగిస్తున్నారు. నాణ్యత సరిగా లేదని చెబుతూ ధర గణనీయంగా తగ్గిస్తున్నారు. ఇష్టమైతే అమ్మండి లేకుంటే మీ సరుకు తీసుకెళ్లండంటూ మొండిగా వ్యవహరిస్తున్నారు. దీంతో కడుపు కాలిన మిర్చి రైతులు మంగళవారం మిర్చి యార్డు గేట్లకు తాళం వేసి నల్లపాడు రోడ్డులో జాతీయ రహదారిపై నాలుగు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. తమకు గిట్టుబాటు ధర కావాలని నినాదాలు చేశారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెబితేనే ఆందోళన విరమిస్తామని అక్కడికి వచ్చిన పోలీసు అధికారులకు తేల్చి చెప్పారు. రైతుల ఆందోళన సున్నితమైనది కావడంతో పోలీసులు సంయమనం పాటించారు. వాహనదారులు, బస్సుల్లో ఉన్న ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని, ఆందోళన విరమించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. చివరికి మిర్చియార్డు పర్సన్ ఇన్‌చార్జ్, జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ, ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక వచ్చి చర్చలు జరిపి తాము ప్రభుత్వానికి నివేదించి కనీస మద్దతు ధర వచ్చేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపచేశారు. రైతులు తమ ఆధార్, ఈ-క్రాప్ బుకింగ్, బ్యాంకు అకౌంట్ వివరాలను యార్డు పరిపాలన భవనంలో సమర్పించాలని కోరారు. రైతులు కోరిన విధంగా మిర్చి ధరలు ఎప్పటికప్పుడు తెలిసేలా ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. మిర్చి రైతులు సుమారు నాలుగు గంటల పాటు రాస్తారోకో చేయడం వలన నల్లపాడు రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోయింది. మరోవైపు పోలీసులు చుట్టుగుంట వద్దనే ట్రాఫిక్‌ని మళ్లించారు. అలానే హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న వాహనాలను నల్లపాడు వద్ద ఇన్నర్ రింగు రోడ్డులో నుంచి చిలకలూరిపేట హైవే వైపు మళ్లించారు.


నల్లపాడు రోడ్డులో స్తంభించిపోయిన వాహనాలు

రైతుల ఆందోళన వెనక వైసీపీ పాత్రపై అనుమానాలు

మిర్చి రైతులు హఠాత్తుగా ఆందోళనకు దిగడం వెనక వైసీపీ సానుకూల వ్యాపారస్థులు ఉన్నట్లు మార్కెటింగ్ అధికారులు అనుమానిస్తున్నారు. గత ఏడాది మిర్చి యార్డులో ఒక ట్రేడర్ పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన రైతుల మిర్చిని అమ్మేసి దాదాపుగా రూ. 50 లక్షలు బకాయి పడ్డాడు. అయితే అతను ఆ నగదు చెల్లించకపో తుండటంతో రైతులు ఇటీవలే ధర్నా కూడా చేశారు. అలానే కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర నాయకులను కలిసి తమ సమస్యని నివేదించారు. దీనిపై మార్కెటింగ్ శాఖ స్పందించి ఎవరైతే రైతులను మోసం చేశాడో ఆ వ్యాపారి లైసెన్సుని ఇటీవలే సస్పెన్షన్ చేశారు. అయినప్పటికీ అతను యార్డులో మరో ముగ్గురు వ్యాపారస్థులతో చేతులు కలిపి తన వ్యాపారానికి అడ్డం లేకుండా వారి ముసుగులో ట్రేడింగ్ చేస్తున్నాడు. దీనిపై రైతులు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆ ముగ్గురు వ్యాపారస్థులకు కూడా నోటీసులు, షోకాజ్‌లు జారీ చేసి లైసెన్సులను నిలుపుదల చేశారు. ఈ పరిణామం జరిగిన కొద్ది గంటల్లోనే రైతులు రోడ్డెక్కడం వెనక కచ్చితంగా వాళ్లే రైతులను రెచ్చగొట్టారని అధికారులు ఆరోపిస్తున్నారు. మంగళవారం రాస్తారోకో ప్రారంభం సమయంలో వైసీపీ మద్దతుదారులు రైతులతో పాటు ఉండడంతో అనుమానాలు బలపడుతున్నాయి.

కళకళలాడుతున్న అమరావతి

- ఇతర రాష్ట్రాల నుంచి వలస వస్తున్న కూలీలు
- కూలీల కోసం ఏర్పాటవుతున్న తాత్కాలిక షెడ్లు
- భారీగా వస్తున్న యంత్రసామగ్రి

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతి ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉండేది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ ఈ ప్రాంతంలో ఆశలు చిగురించాయి. దానికి ఊతమిస్తూ, అరణ్యంలా మారిన అమరావతిలో వందలకొద్దీ ఎక్స్‌కవేటర్లతో చెట్లు, కంప తొలగింపు పనులను చాలా వరకు ప్రభుత్వం జరిపించింది. అయితే వెనువెంటనే రాజధాని నిర్మాణ పనులను మొదలుపెట్టడానికి ఎన్నో సమస్యలు, న్యాయపరమైన చిక్కుముడులు అడ్డొచ్చాయి. వాటన్నింటిని క్రమంగా ఛేదించుకుంటూ నిధులను సమకూర్చుకుంటూ... నేడు ఏకంగా రమారమి రూ. 50 వేల కోట్ల విలువైన నిర్మాణ పనులను మూకుమ్మడిగా చేపట్టి రాజధాని ప్రాంత వాసులను ఆనందడోలికల్లో ముంచెత్తుతున్నది. దీంతో, అమరావతి పాత, కొత్త వీధులు మళ్లీ జనసామర్థ్యంతో కిక్కిరిస్తున్నాయి. కొత్తకొత్త హోటళ్లు, టీ కొట్లు, బడ్డీ కొట్లు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి. రాజధాని నిర్మాణ పనుల్లో పాలుపంచుకునేందుకు వస్తున్న భారీ యంత్రసామగ్రితో అమరావతి హోరెత్తుతున్నది. ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తున్న కూలీలతో అమరావతి మళ్లీ కళకళలాడుతోంది.

రాజధాని అమరావతిలో నిర్మాణపనులు చేయడానికి టెండర్లను దక్కించుకున్న బడా కాంట్రాక్టు సంస్థలు అప్పుడే కార్యరంగంలోకి దిగిపోయాయి. తామే ఏయే ప్రాజెక్టులను చేపట్టబోతున్నామో ఆయా ప్రాంతాల్లో ఆయా నిర్మాణాలకు సంబంధించిన భారీ యంత్ర పరికరాలను చేరవేసుకుంటున్నారు. ఇవన్నీ హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి దూరప్రాంతాల నుంచి ఇక్కడికి తరలివస్తున్నాయి. ఈ యంత్ర సామగ్రితో పాటుగా కూలీ పనులను చేసేందుకు ప్రతీ కాంట్రాక్టు సంస్థ ఒరిస్సా, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాదిమందిని అమరావతికి రప్పిస్తున్నారు. వీరందరికీ పనిచేయాల్సిన ప్రాంతాలలో భారీ షెడ్లను ఏర్పాటుచేసి వారికి తాగునీరు, టాయ్‌లెట్లు వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా ఎక్కడికక్కడ రెడీమిక్స్ ప్లాంట్లు కూడా పెద్దఎత్తున ఏర్పాటవుతున్నాయి.

ఇదిలావుండగా రాజధాని అమరావతిలో ఏప్రిల్ మూడవ వారంలో జరుగనున్న ప్రధాని మోదీ సభకోసం వచ్చే అతిథులను ఆకట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీడ్ యాక్సిస్‌తో పాటు ఇతర ప్రధాన వీధుల వెంబడి మొక్కలను నాటించే కార్యక్రమాన్ని చేపట్టింది.


అమరావతి ప్రధాన వీధుల వెంబడి మొక్కలను నాటుతున్న దృశ్యం


యంత్రాల సాయంతో అగర్లలోకి పైలెట్ బుట్టలను దించుతున్న దృశ్యం


అమరావతిలో కూలీల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న షెడ్లు



నీటితో కళకళలాడుతున్న పర్చూరు మంచినీటి చెరువు

మంచినీటి చెరువులకు జలకళ

- ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- యుద్ధప్రాతిపదికన నీళ్లు నింపుతున్న అధికారులు

పర్చూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చెరువులను నింపేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా అధికారులతో ముందస్తు రివ్యూ కార్యక్రమం నిర్వహించి పర్చూరు నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలలోని మంచినీటి చెరువులను నింపేవిధంగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో అందుబాటులో ఉన్న సాగర్ జలాలను మంచినీటి చెరువులకు మళ్లించేందుకు యద్ధప్రాతిపదికన అధికారులు చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల సారథ్యంలో చెరువులను నింపుకునే విధంగా బాధ్యతలు అప్పగించారు. చెరువులను సాగర్ జలాలతో నింపుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టడంతో జలకళను సంతరించుకుంటున్నాయి. అందులో భాగంగా పర్చూరులోని రెండు మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో అధికారులు నింపడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవి నీటి ఎద్దడి నుంచి అధికమించామని ఊపిరి పీల్చుకుంటున్నారు.

వేసవిలో జాగ్రత్తలపై అవగాహన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీహెచ్‌సీ డాక్టర్ శరత్‌కుమార్

అద్దంకిటౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం వస్తునందున వేసవి తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి సీహెచ్‌సీ వైద్యుడు డీ శరత్‌కుమార్ అన్నారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై విశ్వకర్మ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేయించిన కరపత్రాన్ని డాక్టర్ శరత్‌కుమార్ మంగళవారం సీహెచ్‌సీలో ఆవిష్కరించారు. వేసవిలో జాగ్రత్తలపై అవగాహన కలిగించేలా కరపత్రాలు వేసిన ట్రస్ట్ వారిని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.ప్రదీప్తి, ట్రస్ట్ అధ్యక్షుడు టి.రామకృష్ణ, ఉపాధ్యాక్షుడు కొండమూది ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, కోశాధికారి రావినూతల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గొలుసు దుకాణంపై ఆగ్రహం



ఆందోళన చేస్తున్న జీవరక్షనగర్ గ్రామస్థులు

వేటపాలెం(చీరాల), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నివాసాల మధ్య గొలుసు దుకాణం నిర్వహిస్తే ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు కలుగుతాయని అధికారులు వీటిపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని దేశాయిపేట పంచాయతీ జీవరక్షనగర్ ప్రజలు అన్నారు. అనధికారంగా ఓవ్యక్తి గొలుసు దుకాణం నిర్వహిస్తున్నారని మంగళవారం వారు కొద్దిసేపు రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో నిర్వాహకుడు అక్కడ నుంచి వెళ్లిపోవడంతో ఆందోళన విరమించారు. మానికల శ్రీనివాసరావు, ఎస్‌కే లాల్, ఎం.పోలీసు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపు ఎంపీపీ పదవులకు పరోక్ష ఎన్నికలు

- రెండు ఎంపీపీలు, ఒక ఉపాధ్యక్ష, కోఆప్షన్‌సభ్యుని పదవికి
- జిల్లాలో నాలుగు ఉపసర్పంచ్ పదవులకు కూడా ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్ర్యోతి): జిల్లాలో ఆకస్మికంగా ఖాళీలు ఏర్పడిన అధ్యక్ష స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసింది. దీంతో తదనుగుణంగా జిల్లాలో ఎన్నికలు నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 27న ఈ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మార్కాపురం, త్రిపురాంతకం మండలాల అధ్యక్ష పదవులు, పుల్లలచెరువు మండలంలో ఉపాధ్యక్ష పదవికి, వైపాలెం మండలంలో కోఆప్షన్ మెంబరు పదవికి ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను గురువారం ఉదయం పరోక్ష పద్ధతిలో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. అందుకోసం ఆయా మండలకేంద్రాల్లో పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు ఆయా మండలాలకు జిల్లాస్థాయి అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించారు.

నాలుగు ఉపసర్పంచ్ పదవులకు..

జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగు ఉప సర్పంచ్ ఎన్నికల పదవులకు ఈనెల 27న పరోక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ముందుగా జిల్లాలో ఎనిమిది ఉప సర్పంచ్ పదవులు ఖాళీగా ఉండటంతో తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు. అయితే నాలుగు పంచాయతీల్లో వార్డు పదవులు ఖాళీగా ఉండటంతో అక్కడ ఎన్నికలను ఎన్నికల కమిషన్ నిలుపుదల చేసింది. మిగిలిన నాలుగు పంచాయతీల్లో ఉప సర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. కొండపి మండలం పెరిదేపి, కంభం మండలం తురిమెళ్ల, టంగుటూరు మండలం ఆలకూరపాడు, త్రిపురాంతకం మండలం మిట్టపాలెంలో ఉపసర్పంచ్ ఎన్నికలను పరోక్ష పద్ధతిలో నిర్వహించారు. వార్డుసభ్యుల పదవి ఖాళీగా ఉన్న నాగన్నపాలెం, నాగంపల్లి, బేస్తవారపేట, టంగుటూరు పంచాయతీల ఉప సర్పంచ్ ఎన్నికలు నిలుపుదల చేశారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు

పామూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.భీమానాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపుతున్నట్టు చెప్పారు. సర్కిల్ పరిధిలోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల్లో క్రికెట్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో చోరీలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దైవాలరావూరులో వేగంగా రీ-సర్వే

తొలగనున్న గట్టు వివాదాలు



దైవాలరావూరులో జరుగుతున్న రీ-సర్వేలో పాల్గొన్న రైతులు

మేదరమెట్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. అందులో భాగంగా కొరిశపాడు మండలంలోని దైవాలరావూరులో రీసర్వేని ప్రారంభించారు. గ్రామాన్ని నాలుగు భాగాలుగా విభజించి సర్వే నెంబర్లవారీగా రైతుల సమక్షంలో గ్రౌండ్ ట్రూతింగ్ నిర్వహించారు. ఒక్కొక్క టీంలో వీఆర్వో, సర్వేయర్, వీఆర్‌ఏలు ఉన్నారు. వీరు ఆయా సర్వే నెంబర్లలో గట్ల వారీగా రైతుల పొలాలను గుర్తించి కంప్యూటర్‌లో మార్కింగ్‌ను నమోదు చేసుకున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక రెవెన్యూ రికార్డుల్లో ఆయా సర్వే నెంబర్లలో ఎంత విస్తీర్ణం ఉన్నది పరిశీలించి, వారి సాగుబడిలో ఆయా సర్వే నెంబర్లలో ఉన్న విస్తీర్ణాన్ని సరిచూస్తున్నారు. సర్వే నంబర్లో ఉన్న రైతులందరినీ పిలిచి వారి సమక్షంలో ఎక్కువ తక్కువలను సరిచేసి విస్తీర్ణాన్ని నిర్ణయిస్తున్నారు. ఒక్కో టీం రోజుకు 5, 6 సర్వే నంబర్లలోని రైతులకు సమాచారం ఇచ్చి పిలుస్తున్నారు. రైతులు పూర్తిగా హాజరు కాకపోవడం, కొన్ని సర్వే నంబర్లలో విస్తీర్ణం తేడాలు రావడంతో రైతులను కూర్చోబెట్టి వివరించడంతో కొంత ఎక్కువ సమయం పడుతుంది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాక డీఎల్ఆర్ తయారు చేయనున్నారు. అప్పుడు రైతులకు సర్వే నంబర్ల వారీ హద్దు రాళ్లు వేయనున్నారు.

కొంత ఎక్కువ సమయం పట్టినా రైతులను బాగస్వాములను చేసి రికార్డులు తయారు చేయడం వల్ల భవిష్యత్‌లో భూమి సంబంధ విషయాలలో వివాదాలకు తావుండదు. గత ప్రభుత్వం రీసర్వే టీంలకు అధికారులు లక్ష్యాలు నిర్ణయించి ఒత్తిడి చేయడంతో ఎక్కువ తప్పులు దొర్లి రైతులకు సమస్యలు ఎక్కువయ్యాయి. ఇప్పుడైనా ఉన్నతాధికారులు రీసర్వే టీంలకు సమయం ఇచ్చి తప్పులు దొర్లకుండా రికార్డులు రూపొందిస్తే భవిష్యత్తులో గట్టు సమస్యలు, భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభించినట్టే.

హడావుడిగా రీసర్వే చేయొద్దు



ఉన్నతాదికారులు హడావుడి చేయడం వలన రీసర్వేలో తప్పులు దొర్లే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో రీసర్వే హడావుడిగా చేయడం వలన రైతులు ఇప్పటికి కూడా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారులు కూడా గ్రామాలకు వచ్చి రీసర్వేలో రైతుల సమస్యలను తెలుసుకోవాలి.

\- ముమ్మన నరసింహారావు, రైతు

రైతుల సమక్షంలోనే జరగాలి



రైతుల సమక్షంలో రీసర్వే చేయడం వలన భవిష్యత్‌లో సమస్యలు రావు. అధికారులు పిలిచిన రోజే కొందరు రైతులు రాలేకపోవచ్చు. సమయమిచ్చి రైతుల వద్ద సమగ్ర సమాచారం, వారి వద్ద ఉన్న భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను తీసుకోవాలి. రైతులను కూర్చోబెట్టి సమన్వయం చేసి తుది నిర్ణయం తీసుకోవాలి. భవిష్యత్‌లో ఇప్పుడు చేసే రీసర్వేతో రైతులు సమస్యలు తొలగిపోవాలి.

\- బాచిన బాలకోటయ్య, రైతు

ప్రధాన డ్రైన్‌లలో పేరుకున్న పూడిక

దుర్వాసనతో పలు కాలనీ ప్రజల ఇక్కట్లు



అద్దంకి పట్టణంలోని గుంజివారిపాలెం వద్ద మెయిన్ డ్రైన్‌లో పూడిక

అద్దంకి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని పలు ప్రధాన డ్రైన్‌లలో పూడిక పేరుకు పోయింది. దీంతో దుర్వాసన వెదజల్లుతూ ఆయా కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా నామ్ రోడ్డులోని ఎస్‌బీఐ (ఏడీబీ) నుంచి ప్రారంభమయ్యే మెయిన్ డ్రైన్ పూడిక తీత గత ఏడాది కొంత మేర తీసినప్పటికీ గుంజివారిపాలెం సమీపంలో, కట్టకిందపాలెం సమీపంలో వాగులను తలపించేలా ఉన్న మురుకు కాలువలో పెద్ద ఎత్తున పూడిక పేరుకు పోయింది. అదే సమయంలో శ్రీనగర్ నుంచి ప్రారంభమయ్యే డ్రైన్‌లో కూడా గతంలో కొంత మేర పూడిక తీసినప్పటికీ సాయిబాబా గుడి ప్రాంతం నుంచి గుంజివారిపాలెం వరకు పూడిక పెద్ద ఎత్తున పేరుకు పోయింది. అద్దంకి పట్టణంలోని సైడ్ డ్రైన్‌లలో వారంలో ఒక రోజు పూడిక తీస్తున్నప్పటికీ మెయిన్ డ్రైన్ లలో పూడిక తీత ప్రత్యేక సందర్బాలలో మాత్రమే చేపడుతున్నారు. కనీసం ఏడాదిలో రెండు, మూడు సార్లు అయినా పూడిక తీత చేపట్టేలా చర్యలు చేపడితేనే మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా సులువుగా ప్రవహించే వీలుంటుందని ఆయా కాలనీల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రధాన డ్రైన్‌లలో పూడిక పేరకు పోవడంతో కట్టకిందపాలెం, గుంజివారిపాలెం, నర్రావారిపాలెం, సాయిబాబా గుడి తదితర ప్రాంతాల ప్రజలు దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మెయిన్ డ్రైన్‌లలో పూడిక తీసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



సాయిబాబా గుడి వెనుక డ్రైన్‌లో ఉన్న పూడిక

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం



ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న చీరాల డీఎస్పీ మొయిన్

చినగంజాం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లులో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఏప్రిల్ 1వ తేదీన మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వస్తున్నారు. ఆయన పర్యటన విజయవంతం అయ్యేందుకు అన్ని శాఖల అధికారులు, టీడీపీ నాయకులు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో ఉన్న సమస్యలు తెలుసుకునేందుకు అన్ని శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. హెలిపాడ్, బహిరంగసభ, అధికారులతో నిర్వహించే సభాస్థలాల్లో ఉన్న, గ్రామంలోని రోడ్ల వెంబడి ఉన్న చిల్లచెట్లను ఎక్స్‌కవేటర్‌తో పీకిస్తున్నారు.

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు త్రీవముగా కృషి చేస్తున్నారు. చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడు, చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్, పలు శాఖలకు చెందిన ఉన్నాతాధికారులు తమ సిబ్బందికి పలు సూచనలు ఇస్తున్నారు. మూరుమూల గ్రామైన ఆవులదొడ్డికొత్తగొల్లపాలెం గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రావడంతో గ్రామస్థులు కూడా పూర్తి సహకారంతో పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అందరూ సిద్ధమవుతున్నారు.

నాడు హామీ.. నేడు అమలు

(5వ పేజీ తరువాయి)

మున్సిపాల్టీలో అభివృద్ధిని గాలికొదిలేసిందని జీవీ ఆంజనేయులు ఆరోపించారు. నాడు టీడీపీ ప్రభుత్వం రూ.161 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టగా వైసీపీ వాటిని నిలివేసిందని విమర్శించారు. తాజాగా ఆ పతకాన్ని తాము అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ పథకం పూర్తితో పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. 102.60 లక్షలతో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ద్వారా ప్రజలు వారి సమస్యలు తన దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కారిస్తున్నామన్నారు. ఆంధ్రజ్యోతి వేదికగా ప్రజలు కోరిన పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ నిధులు రూ.3 కోట్లను విడుదల చేసిందని వాటితో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంతో ప్రజలకు ప్రజాప్రతినిధులు.. అధికారుల మధ్య అవినాభావ సంబంధం పెరుగుతుందన్నారు. సమస్యల్ని అధికారులు.. ప్రజా ప్రతినిధులు స్పష్టంగా అర్థం చేసుకోవడానికి.. వాటి పరిష్కారానికి అవకాశం కలుగుతుందన్నారు. ఇటువంటి వినూత్న కార్యక్రమం చేపట్టిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చైర్మన్ వేమూరి రాధాకృష్ణకు ప్రత్యేక అభినందలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ షేక్ దస్తగిరి, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు వాసిరెడ్డి లింగమూర్తి, నన్నేసా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ లెనిన్‌కుమార్, నాగ శ్రీను, నిశ్శంకర శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి హనుమంతరావు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై చర్యలు నిల్

- గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అడ్డగోలుగా డ్రా విచారణ పేరుతో జాప్యం

దర్శి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పలు పంచాయతీల్లోని నిధులను అడ్డగోలుగా మార్చుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఇష్టానుసారంగా వ్యవహరించారు. కొన్ని పంచాయతీల్లో ఎలాంటి పనులు చేయకుండా లక్షలాది రూపాయలు డ్రా చేశారు. ఇంజనీరింగ్ అధికారులు కిక్కురుమనకుండా బిల్లులు చేశారు. నిధులు గోల్‌మాల్ విషయాలు బయటకు రావటంతో కొన్ని గ్రామాల్లో స్థానిక నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. నిజాలు నిగ్గు తేల్చేందుకు విచారణ కమిటీ అధికారిని వేశారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మండలంలోని తూర్పువెంకటాపురం పంచాయతీలో రూ.25లక్షల నిధులు గోల్‌మాల్ అయ్యాయని ఆ గ్రామానికి చెందిన పలువురు నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పలుమార్లు ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో కనిగిరి డీఎల్‌పీవోను విచారణాధికారిగా నియమించారు. ఆ అధికారి విచారణ అడుగు ముందుకు పడలేదు.

ప్లాస్టిక్‌పై నిషేధం

పంచాయతీ ఆంక్షలు

పర్చూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకం రోజురోజుకూ పెరిగిపోవడం, వాటి వ్యర్థాలను డ్రైనేజ్ కాలువల్లో వేయడంతో మురుగు నీరు ముందుకు కదలక సమస్యగా మారింది. దీంతో ప్లాస్టిక్‌పై నిషేధం విధిస్తూ పంచాయతీ అంక్షలు జారీ చేశారు. విచ్చిల విడిగా ప్లాస్టిక్ వ్యర్థాలను మురుగు కాలువల్లో వేయడంతో రోజుల తరబడి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి డ్రైనేజీ సమస్య తీవ్రంగా మారుతోంది. పారిశుధ్య కార్మికులు నిత్యం పారిశుధ్య కార్య క్రమాలు చేపడుతున్నా ఫలితం లేకుండా పోతుంది. ఈ తరుణంలో డ్రైనేజీ కాలువల్లో పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు అనే వార్త ఇటీవల ఆంధ్రజ్యోతిలో వెలువడింది. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తూ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. ఎక్కడైనా ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు విక్రయించే దుకాణదారులపై జరిమాన విధిస్తామని హెచ్చరిక చేశారు. పంచాయతీ అధికారులు తీసుకున్న ప్లాస్టిక్ నిషేధ నిర్ణయంపై ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యాధికారి తనిఖీలు



ప్రైవేటు ఆసుపత్రిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి విజయమ్మ

చీరాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం చీరాల పరిధిలోని పలు ప్రైవేటు వైద్యశాలల్లో జిల్లా వైద్యాధికారిణి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఆయా వైద్యశాలల్లో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, రికార్డులు పరిశీలించారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిరారణ చేయరాదని సూచించారు. వైద్య సేవలు పారదర్శకంగా లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట పలువురు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

పరీక్షల వేళ.. పెరిగిన కోతలు

(5వ పేజీ తరువాయి)

ఉండని పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎప్పుడు విద్యుత్ సరఫరా ఉంటుందో, పోతుందో తెలియని పరిస్థితులున్నాయి. సాంకేతిక కారణాలని అధికారులు పైకి చెప్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో విద్యుత్‌శాఖ వైఫల్యంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సెక్షన్‌ల పరిధిలో విద్యుత్‌లైన్‌ల నిర్వహణ కోసం లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) పేరుతో రోజుల తరబడి పనులు చేస్తుండటం కూడా ప్రజల్లో అసహనం కలిగిస్తోంది. ప్రతి నెలలో రెండో శనివారం విద్యుత్‌లైన్‌ల నిర్వహణ కోసం విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉదయం నుంచి మధ్యాహ్నం, కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం వరకు విద్యుత్ సిబ్బంది పనులు చేస్తున్నారు. అది చాలదన్నట్లు సాధారణ రోజుల్లోనూ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతోన్న వేసవితో గుంటూరు సర్కిల్ పరిధిలోని ఐదు మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం పెరిగింది. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్స్‌లో దాదాపు 15 మిలియన్ యూనిట్లపైనే విద్యుత్ వినియోగం జరుగుతుంది. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి ఉన్నప్పటికీ అంతరాయాలు రావటం అధికారుల వైఫల్యానికి అద్దం పడుతోంది.

స్టోర్స్‌లో పరికరాల్లేవంటూ విమర్శలు

విద్యుత్ లైన్‌లకు సంబంధించి 11 కేవీ తీగెలు, స్విచ్‌లు, ఎర్త్ వైర్లు, కండక్టర్‌లు, కేబుల్స్ వంటివి సెక్షన్ కార్యాలయాల పరిధిలో అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని సెక్షన్‌ల పరిధిలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నా పట్టించుకున్న నాధుడే ఉండటం లేదని సిబ్బంది వాపోతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాపం ఇప్పుడు శాపంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సెక్షన్‌లలో ఒకరు మాత్రమే లైన్‌మెన్ ఉండటం కూడా విద్యుత్ అంతరాయాలకు కారణాలుగా చెబుతున్నారు.

డీఎస్పీకి ఘన సన్మానం

దర్శి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దర్శి డీఎస్పీ బీ లక్ష్మినారాయణ రాష్ట్ర స్థాయి ఉగాది ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికైన సందర్భంగా పోలీసులు మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో సీఐ వై.రామారావు, ఎస్‌ఐ ఎం.మురళి ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది డీఎస్పీ లక్ష్మినారాయణను శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు.

రక్షిత నీటి పథకాలకు మహర్దశ

- ఎన్నో దశాబ్దాల నుంచి నిరుపయోగం
- జలజీవన్ మిషన్ ద్వారా మరమ్మతులకు నిధులు
- బల్లికురవ మండలంలో 21 వర్కులకు రూ.8.50కోట్లు మంజూరు
- తాగునీటిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మంత్రి రవికుమార్ కృషితో అన్ని గ్రామాలలో ఇంటింటికీ కొళాయి నీరు ఇచ్చేలా ప్రణాళికలు


నిరుపయోగంగా ఉన్న బల్లికువరం ఓవర్ హెడ్ ట్యాంక్


రామాంజనేయపురంలో అలంకారంగా ఉన్న ట్యాంక్


వేమవరంలో ఫిల్టర్లు లేకుండానే ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్

బల్లికురవ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాల నుంచి గ్రామాలలో కోట్లు వెచ్చించి నిర్మాణం చేసిన రక్షిత మంచి నీటి పథకాలు అలంకారంగా ఉన్నాయి. నిధుల లేమితో పథకాలు పనిచేయకుండానే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి శుభ్రం చేసిన కొళాయి నీటిని అందించేలా అడుగులు పడుతున్నాయి. అందుకు గాను జలజీవన్ మిషన్ ద్వారా బల్లికురవ మండలానికి రూ.8.50కోట్లు మంజూరయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇప్పటికే మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు గ్రామాలలో రక్షిత నీరు అందిచేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపారు. టెండర్లు ఈ మాసంలో పూర్తి అయి ఏప్రిల్ నుంచి గ్రామాలలో పనులు ప్రారంభం చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బల్లికురవ మండలంలో అత్యధిక గ్రామాలలో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు ఉన్నాయి. గత కొన్నేళ్ల కిందట పలు గ్రామాలలో రక్షిత మంచి నీటి పథకాలు కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టిన అవి స్వల్ప మర్మమ్మతులతో నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రజలు తాగు నీరు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అన్ని గ్రామాలలో నిరుపయోగంగా మంచి నీటి పథకాలను వినియోగంలోకి తెచ్చేలా జలజీవన్ మిషన్‌లో రూ.8.50కోట్లను మంజూరు చేయించారు. ఈ నిధులతో గ్రామాలలో ఉన్న రక్షిత నీటి పథకాల పైపులైన్లు, ట్యాంకులు, ఇంటింటికీ కొళాయిలు వంటి పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలలో అధికారులు పర్యటించి గ్రామాలలో అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేసి పంపగా నిధులు మంజురయ్యాయి. బల్లికురవ మండలంలో 21 వర్కులకు టెండర్లు కూడా ఈ నెలలో జరగనున్నాయి. రానున్న నెలలో గ్రామాలలో రక్షిత నీటి పథకాల మరమ్మతులకు జల జీవన్ మిషన్ పథకంలో పనులు ప్రారంభం కానున్నాయి.

బల్లికురవ మండలానికి నిధులు మంజూరు

జలజీవన్ మిషన్ ద్వారా బల్లికురవ మండలంలో ఉన్న రక్షిత మంచి నీటి పథకాలను వినియోగంలోకి తెచ్చేలా ప్రభుత్వం రూ. 8.50కోట్ల నిధులను 21 వర్క్‌లకు కేటాయించింది. పెద అంబడిపూడికి రూ.25లక్షలు, సూరేపల్లికి రూ.18లక్షలు, వైదనకు 46 లక్షలు, వెలమవారిపాలెంకు రూ.51లక్షలు, వేమవరానికి రూ.57.5 లక్షలు, గుంటుపల్లికి రూ.18.9లక్షలు, కొండాయపాలెంకు రూ.21 లక్షలు, చెన్నుపల్లికి రూ.65లక్షలు, గొర్రెపాడుకు రూ.11.2 లక్షలు, జమ్మలమడకకు రూ.27లక్షలు, కె.రాజుపాలెంకు రూ.40 లక్షలు, కొమ్మినేనివారిపాలెంకు రూ.39.8లక్షలు, కొణిదెనకు రూ.52 లక్షలు, కొత్తూరుకు రూ.21 లక్షలు, కొప్పెరపాలెంకు రూ.1.8 కోట్లు, కూకట్లపల్లికి రూ.31లక్షలు, ముక్తేశ్వరానికి రూ.36లక్షలు, నక్కబొక్కలపాడుకు రూ.97లక్షల నిధు లు మంజూరయ్యాయి.


సద్ది, పొంగళ్లను ఊరేగింపుగా తీసుకొని వెళ్తున్న భక్తులు

పొలేరమ్మ అమ్మవారికి ఉగాది పూజలు

చినగంజాం, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ అమ్మవారికి మంగళవారం ఉగాది పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు సద్ది, పొంగళ్లు తీసుకొని గ్రామ పురవీధులలో మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లారు. ఆలయం వద్ద ప్రదక్షిణలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉగాది పర్వదినానికి ముందు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ పెద్దలు, కాపుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహిళా భక్తులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జయగురుదత్త, శివదత్త క్షేత్రంలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

చీరాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జయగురుదత్త, శివదత్త క్షేత్రంలో ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా భక్తులు విశేషంగా పాల్గొని ఉదయం సంప్రోక్షణ, అనంతరం శాంతి హోమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మాట్లాడుతూ వేకువజాము నుంచే భక్తులు పాల్గొని స్వామి నామాన్ని ఆలపించినట్లు చెప్పారు. ఈసందర్భంగా ప్రత్యేక అలంకరణలు నిర్వహించి, పూజలు అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

వాగు అభివృద్ధికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పర్చూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వాగు అభివృద్ధి చర్యలు తీసుకుంటున్నట్లు డ్రైనేజీ అధికారులు తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో వాగును కమ్మేసిన ముళ్ల పొదలు అనే శీర్షికలో వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. వాగు అభివృద్ధికి తీసుకోకున్న చర్యలపై జిల్లా పౌరసంబంధ శాఖ అధికారికి వివరణ పంపారు. కారంచేడు - పర్చూరు మధ్య ముళ్ల చెట్లు తొలగించి, పూడిక తీసేందుకు రూ.37.3 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. పర్చూరు పరిధిలో ఉన్న ఉప్పుటూరు - పెద్దివారిపాలెం మధ్య భూసేకరణ సమస్య ఉన్నప్పటికీ పనులు చేసేందుకు రూ.81.3లక్షల నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రాంభించి పూర్తి స్థాయిలో వాగు అభివృద్ధికి చర్యలు చేపడతామని డ్రైనేజ్ ఏఈ ఎస్.రత్నశేఖర్ తెలియజేశారు.

ఖేలో ఇండియాలో ఈపూరుపాలెంవాసికి బెస్ట్ కోచ్ అవార్డ్


అవార్డును అందుకుంటున్న వేణు

ఈపూరుపాలెం(చీరాల), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 21 -23 వరకు జరిగిన రెండవ ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో తెలంగాణకు చెందిన టీం సత్తా చాటింది. ఆ టీమ్‌కు మండల పరిధిలోని ఈపూరుపాలెంకు చెందిన విన్నకోటి వేణు కోచ్‌గా వ్యవహరించడంతో పాటు కోచ్‌లకు నిర్వహించిన మెమెంటో గేమ్స్‌లో కూడా ప్రతిభను కనబరిచి బెస్ట్ కోచ్ అవార్డును అందుకున్నారు. దీంతో ఈపూరుపాఎం వాసులు వేణుకు అభినందనలు తెలిపారు.

ఈకేవైసీతో ప్రజా సరుకుల పంపిణీ సులభం


డీఎస్‌వో విలియమ్స్

చీరాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుల ద్వారా అందించే పథకాలకు సంబంధించి కార్డులో ఉన్న సభ్యులు తప్పనిసరిగా డీలర్ వద్ద వేలిముద్రలు వేయాలని డీఎస్‌వో విలియమ్స్ తెలిపారు. వేలిముద్రలు (ఈకేవైసీ) అవసరమై వారి వివరాలను ఇప్పటికే ఆయా రేషన్ షాపుల నిర్వాహకులకు చేర్పినట్లు వివరించారు. వేలిముద్రల సేకరణ పారదర్శకంగా చేయడం వలన తొలగించాల్సిన, చేర్చాల్సిన వారి వివరాలతో పాటు ఇతర సమస్యలకు పరిష్కారం ఉంటుందని డీఎస్‌వో విలయమ్స్ తెలిపారు.

టాలెంట్ టెస్ట్‌లతో విద్యార్థుల్లో పోటీతత్వం


టాలెంట్ టెస్ట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో-2 సుధాకరరావు

అద్దంకిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడం ద్వారా వారిలో పోటీతత్వం, పరీక్షలపై ఆసక్తి పెరుగుతుందని ఎంఈవో-2 బూదాటి సుధాకరరావు అన్నారు. మంగళవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి, 8వ తరగతి చదువుతున్న బాల,బాలికకలకు ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని ఎంఈవో-2 సుధాకరరావు సందర్శించారు. ఈ టెస్ట్‌లో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి 5వ తరగతి నుంచి 120 మంది, 8వ తరగతి నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో 5వ తరగతిలో ఎంపీపీఎస్ తిమ్మయపాలెం(హిందూ) విద్యార్థిని జీ లేఖాసాయిశ్రీ 50 మార్కులకు 33 మార్కులతో ప్రథమ, ఎంపీపీఎస్ పేరాయపాలెంకు చెందిన ఆర్.రిషిక్‌తేజ 31 మార్కులతో ద్వితీయ, ఎంపీపీఎస్ కలవకూరుకు చెందిన టి. ఆంటోని, ఎంపీయూపీఎస్ అద్దంకికి చెందిన వెంకటప్రవీణ్‌కుమార్, ఏ.అచ్యుతానంద 30 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. 8వ తరగతిలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన డి.మనీషా 50 మార్కులకు 34 మార్కులతో ప్రథమ స్థానం, జడ్పీహెచ్‌ఎస్ తిమ్మాయపాలెంకు చెందిన పి. తమన్ సూర్య 28 మార్కులతో ద్వితీయ స్థానం, జడ్పీహెచ్‌ఎస్ ధేనువకొండకు చెందిన ఎం.అపర్ణ 27 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం, బొమ్మనంపాడు, చక్రాయపాలెం, గొరకాయపాలెం జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎంలు వీ శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనివాసమూర్తి, కేవీ శ్రీనివాసరావు, ఎల్.సుజాత పర్యవేక్షించారు. సిబ్బంది పాల్గొన్నారు.

మే 19న కుంభాభిషేకం

అద్దంకి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతిముఖమండపం పునఃనిర్మాణ పనులు పూర్తి చేసుకొని, మే 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి ఆధ్వర్యంలో కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. కుంభాభిషేకం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలలో భాగంగా చంద్రమౌళీశ్వరపూజ, పాదుకాపూజలను నిర్వహించేందుకు వీలుగా టీటీడీ కల్యాణ మండపంలో అవసరమైన మరమ్మతుల చేపట్టేందుకు మంగళవారం ఈవో పూజలు చేసి పనులు ప్రారంభింపచేశారు. పూజారులు పాల్గొన్నారు.

మంచినీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న అధికారులు

ఇంకొల్లు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో పెట్టుకొని మండలంలోని తాగునీటి చెరువులను సాగర్ జలాలతో నింపామని, మే వరకూ తాగునీటికి ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జ్యోతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో 8 గ్రామాలకు జలజీవన్ పథకం కింద సుమారు రూ.3కోట్ల84 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఆ నిధులతో ఫిల్టర్‌బెడ్‌లు, పైపులైన్లు వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వరుసగా సర్వసభ్యసమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏవో వేణుగోపాల్, ఏపీఎం అనూరాధ, ఏపీవో రేణుక, సీడీపీవో ఝాన్సీ, డా.శివ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరయ్యారు.

ప్రతి రైతు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కలిగి ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్

అద్దంకిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతూ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కలిగి ఉండాలని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) కె.ధనరాజ్ అన్నారు. మంగళవారం మం డలంలోని బొమ్మనంపాడు, జార్లపాలెం గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ మండలలో 9345 మంది పీఎం కిసాన్ లబ్దిదారులు ఉన్నారని, ఇప్పటికి 7200మంది మాత్రమే గుర్తింపు సంఖ్య కోసం దరకాస్తు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన రైతులు ఈనెల 31వ తేదీలోపు ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, లేని పక్షంలో పీఎం కిసాన్ లబ్ధి చేకూరదని తెలిపారు. ప్రభుత్వం మద్దతు దరకు శనగలు కొనుగోలు చేస్తుందని, మద్దతు ధర క్వింటా రూ.5650గా నిర్ణయించారని తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరావు, వీఏఏలు వీరశంకర్, ఆంజాద్, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలి

బల్లికురవ : వ్యవసాయ యంత్ర పరికరాలు అవసరమైన రైతులు గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కుమారి కోరారు. మండలంలోని కొప్పెరపాడు, ఎస్ఎల్ గుడిపాడు గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏవో రైతులు సాగు చేసిన మినుము పంటను పరిశీలించి పల్లాకు తెగులు నివారణ కు పలు సూచనలు చేశారు. అనంతరం రైతులతో జరిగిన సమావేశం లో ఏవో మాట్లాడుతు బల్లికురవ మండలానికి 30 ట్రాక్టర్ పరికరాలు, 20 మందు పిచికారీ స్ప్రేయర్లు, ఒక రోటావేటర్ మంజూరయ్యాయని, అర్హత ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు పవన్‌సాయి, రమణయ్య పాల్గొన్నారు.

మద్దతు ధరకు అపరాల కొనుగోలు

పర్చూరు : అపరాలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, ప్రైవేటు వ్యక్తులను నమ్మి తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దని ఏడీఏ ఎస్.మోహనరావు తెలిపారు. మంగళవారం మండలంలోని చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం ఏవో ఎస్.రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ మాట్లాడుతూ అపరాలకు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం శనగలకు క్వింటాకు రూ.5650, మినుములు క్వింటా రూ.7400, పెసలు క్వింటా రూ.8682 చొప్పున మార్క్‌ఫెడ్, సొసైటీల ద్వారా కొనుగోలు చేస్తారని చెప్పారు. పర్చూరు మండల పరిధిలోని అడుసుమల్లి, గొల్లపూడి, అన్నంబొట్లవారిపాలెం, వీరన్నపాలెం, బోడవాడ, రమణాయపాలెం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, గ్రామ వీఏఏఎస్‌లు, ఆదర్శ రైతులు, రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి : వేసవిలో రైతులకు అనుకూలమైనందువలన భూసార పరీక్షలను రైతులు చేయించుకోవాలని వ్యవసాయఅధికారి ఎస్.మేరమ్మ రైతులకు సూచించారు. మంగళవారం యద్దనపూడి మండలంలోని తనుబొద్దివారిపాలెం, మున్నంగివారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మేరమ్మ మాట్లాడుతూ పంటలు ఇంటికి రావడంతో పొలాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అందు వలన మట్టి నమూనాలను రైతులు తీసుకొని భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. అదేవిధంగా వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సుదర్శన, పలువురు రైతులు పాల్గొన్నారు.


విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

సెయింట్ ఆన్స్ విద్యార్థినులకు లోటస్ పెటల్ స్కాలర్‌షిప్

చీరాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ మార్గాలను ఎంచుకుని అవకాశాలను అంది పుచ్చుకోవాలని సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. ఇటీవల లోటస్ పెటల్ ఫౌండేషన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విజయ రేణుక ఉత్తమంగా రాణించి ప్రతభను కనబరిచారు. దీంతో ఫౌండేషన్ నుంచి విన్నీ సన్ స్కాలర్ షిప్‌నకు ఎంపికయ్యారు. ఈ స్కాలర్ షిప్ ద్వారా యేటా రూ.62,300 నాలుగేళ్లు పాటు అందుతాయని వివరించారు. ఈసందర్భంగా సంబంధిత జ్ఞాపికను మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.జగదీష్, అమర్నాథ్‌బాబు, డా.హరిణి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి

మార్టూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం కావడంతో విద్యార్థులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని స్కూల్ ప్రధానోపాధ్యాయులను ఎంఈవో వస్రాంనాయక్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. వాటిలో మార్టూరులోని అంబేద్కర్ నగర్‌లోని ఏఏ ప్రాథమిక పాఠశాలను, జొన్నతాళిలోని ప్రాథమిక పాఠశాలను, వలపర్లలోని సుమేధ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఫిజికల్ విద్యార్థులు ఉండి, వివిధ కారణాలు దృష్ట్యా ఆపార్ కార్డులు జనరేట్ కాని 19 మంది విద్యార్థులతో కలిసి ఫొటోలు దిగి ఆన్‌లైన్ అడ్మిషన్ నమోదుకు సిఫారసు చేశారు. అదేవిదంగా ఒంటిపూట బడులను జాగ్రత్తగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఆయన వెంట సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు


గ్రంథాలయంలో తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి

బల్లికురవ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలలో ఉన్న అన్ని గ్రంథాలయాలలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తామని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవలో ఉన్న గ్రంథాలయాన్ని అమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో 66 గ్రంథాలయాలు పని చేస్తున్నాయన్నారు. ప్రజలకు నూతన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు ప్రజలు గ్రంథాలయాలను సందర్శించాలన్నారు. సిబ్బంది కొరత విషయం ప్రభుత్వ దృష్టిలో ఉందని, త్వరలో కొత్త పోస్టులు భర్తీ చేస్తారని తెలిపారు. అలానే గ్రామాలలో ప్రజలకు పుస్తక నిక్షిప్త కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు పత్రికలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ఈ తనిఖీలో ఇన్‌చార్జి గ్రంథ పాలకుడు కె.మహేశ్వరరావు పాల్గొన్నారు.

లారీలను ఆపి.. ఆర్డీవో పేరుతో డబ్బు వసూలు

ఇద్దరికి ఏడాది జైలు, రూ.10వేల జరిమానా

అద్దంకి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : దశాబ్ద కాలం కిందట నామ్ రోడ్డులో లారీలను ఆపి.. ఆర్డీవోనని చెప్పి, భయపెట్టి డబ్బులు వసూలు చేసిన ఇద్దరికి ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ అద్దంకి కోర్టులో మంగళవారం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీసీత తీర్పు చెప్పారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరుకు చెందిన లారీ డ్రైవర్ గోవిందస్వామి సురేష్ 2015 జనవరి 18వ తేదీన మధ్య ప్రదేశ్ నుంచి చెన్నైకి లారీలో మార్బుల్ లోడుతో వెళ్తున్నారు. నామ్ రోడ్డులో అద్దంకి మండలం చక్రాయపాలెం వద్దకు వచ్చే సరికి ఆర్డీవోనని చెప్పి ఇద్దరు హైదరాబాద్‌లో ఇన్‌కంటాక్స్ కన్స్‌ల్టెన్సీ ఆఫీస్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన అజిత్‌కుమార్ సింగ్ (అజయ్), నల్గొండ జిల్లా నకిరికల్లు మండలం కేతపల్లికి చెందిన దేశగాని కరుణాకర్ లారీని ఆపారు. క్లీనర్‌ని కొట్టి రూ.25వేల నగదు తీసుకు వెళ్లారు. అప్పటి ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. సీఐ బేతపూడి ప్రసాద్, ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. కేసు విచారణ చేసి మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత ఇద్దరికి ఏడాది జైలు, రూ.10వేల ఫైన్ విధించారు. నిందితులకు శిక్షపడేలా సీఐ సుబ్బరాజు, కోర్టు కానిస్టేబుల్ రమణ కృషి చేశారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

మార్టూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగరాజుపల్లి గ్రామానికి చెందిన కుందేటి నాగేశ్వరరావు వేధిస్తున్నారని భార్య లక్ష్మి ఫిర్యాదు చేయగా మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాషా తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాల కారణంగా గత నాలుగురోజుల కిందట లక్ష్మి తన స్వగ్రామమైన తాటివారిపాలెం గ్రామంలోని పుట్టింటికి వెళ్లారు. అయితే సోమవారం రాత్రి తాటివారిపాలెం వెళ్లిన నాగేశ్వరరావు భార్యపై కర్రతో గాయపరచాడు. దాంతో ఆమెను కుటుంబసభ్యులు వైద్యం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న లక్ష్మి ఆస్పత్రి నుంచి ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు బాషా తెలిపారు.

గిరిజనులకు తాగునీటి వసతి కల్పించాలి

వేటపాలెం (చీరాల), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నీటి సమస్యలు లేకపోయినా నిర్వహణ లోపంతో సర్వోదయ కాలనీ, సమైక్య నగర్ ప్రాంతాల్లో గిరిజనులకు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు తాగునీటిని అందించాలని కోరుతూ ఆయా కాలనీవాసులు, సీపీఎం నాయకుడు ఎన్.బాబూరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ పార్వతికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ అయ్యప్ప రెడ్డి, ఆంజనేయులు, గిరిజన మహిళ నాయకులు లక్ష్మి, నాగేశ్వరి, వెంకటేశ్వరమ్మ, రమణ పాల్గొన్నారు.


తహసీల్దార్ పార్వతికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు